ఈనాడు
అమరావతి
కృష్ణా
మంగళవారం అక్టోబరు 22, 2024

అమరవీరుల త్యాగఫలం అజరామరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, వేదికపై ఎస్పీ గంగాధరరావు, ఏఎస్పీ ప్రసాద్

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే : దేశ, సమాజ రక్షణ కోసం అమరవీరులైన వారి త్యాగఫలం అజరామరం అని గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఎస్పీ గంగాధరరావుతో కలిసి పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తమ ప్రాణాలను తృణప్రాయంగా భావించిన అమరవీరుల త్యాగఫలం వల్లే ప్రజలు నిశ్చింతగా ఉండగలుగుతున్నారన్నారు. నిరంతరం అసాంఘిక శక్తులతో పోరాడే వారి తెగువ స్ఫూర్తిదాయకమన్నారు. ప్రపంచం మొత్తం నిద్రిస్తున్నా కంటిమీద కునుకు లేకుండా శాంతి భద్రతలను పరిరక్షించే పోలీస్ సిబ్బందికి అభినందనలు తెలుపుతూ దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో అమరులైన వారికి ఘన నివాళులర్పించారు. ఎస్పీ గంగాధరరావు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ ప్రాముఖ్యత, నిర్వహించుకుంటున్న తీరును వివరించారు. తొలుత దేశవ్యాప్తంగా అమరులైన సిబ్బంది పేర్లతో కూడిన పుస్తకాన్ని ఆర్ఎస్సై వర్మ మంత్రికి అందించగా ఆయన ఆవిష్కరించారు. ఏఎస్పీ ఎస్‌వీడీ ప్రసాద్ అమరులైన సిబ్బంది పేర్లను చదివి వినిపించారు. వారిలో జిల్లాకు సంబంధించిన ఏఎస్సైలు కె.వెంకటేశ్వరరావు, ఎం.సుబ్బారావు, హెడ్‌కానిస్టేబుళ్లు సీహెచ్ నాగరాజు, జి.ప్రసాదరావు, బీపీ కాంతారావు, కె.వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లు ఎం.జస్వంతరావు, జె.వెంకటనారాయణ, ఏఆర్ పీసీ ఎం.వెంకటేశ్వరరావు, రికార్డు అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు ఉన్నారు.

★ పోలీస్ సంక్షేమ నిధికోసం మంత్రి రవీంద్ర రూ.50 వేలు అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అమరవీరుల స్థూపం వద్ద వారిని స్మరించుకుంటూ మంత్రి, ఎస్పీ, పోలీస్ అధికారులు పూలదండలతో నివాళులర్పించి రెండు నిమిషాల మౌనం పాటించారు. వివిధ అనారోగ్య కారణాలతో మృతి చెందిన సిబ్బంది కుటుంబ సభ్యులకు చిరు జ్ఞాపికలు అందజేశారు. అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ పోలీస్ కార్యాలయం నుంచి లక్ష్మీటాకీస్ సెంటరు వరకూ నిర్వహించిన శాంతి ర్యాలీలో మంత్రి, అధికారులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.


అమరవీరులకు నివాళులర్పిస్తున్న మంత్రి రవీంద్ర

ప్రకాశం బ్యారేజీకి వరద

కృష్ణలంక, న్యూస్‌టుడే: ప్రకాశం బ్యారేజీకి సోమవారం సాయంత్రానికి ఎగువ నుంచి 2,20,500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరినట్లు అధికారులు తెలిపారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 5,309 క్యూసెక్కులు, పశ్చిమ ప్రధాన కాలువకు 2,519 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద నీటిమట్టం 12 అడుగులు కాగా.. . 70 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,28,328 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

రారండ్రో.. వేడుక పిలిచెన్



పున్నమిఘాట్ వద్ద రిహార్సల్స్



బబ్బూరి మైదానంలో డ్రోన్ షో పోస్టర్లు


ప్రధాన వేదిక


సీకే కన్వెన్షన్‌లో ముస్తాబైన వేదిక


డ్రోన్లతో గౌతమ బుద్ధుడు, విమానం ఆకృతులు


వెలుగుల వేడుకకు సర్వం సిద్ధం


అతిథుల ప్రసంగాలను వీక్షించేలా భారీ తెర


వినువీధిలో ఎగరేస్తాం...

నేటి నుంచి డ్రోన్ సమ్మిట్-2024

భవానీపురం, న్యూస్‌టుడే: అమరావతి రాజధానికి బ్రాండ్ ఇమేజ్ తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా కృష్ణా నదీతీరం వెంబడి పున్నమి, భవానీ ఘాట్‌ల వేదికగా డ్రోన్‌షో నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గతంలో ఎన్నడూ జరగని రీతిలో డ్రోన్‌షో నిర్వహించనున్నారు. కృష్ణానదిపై ఆకాశంలో ఒక్కసారిగా 5,500 డ్రోన్లు కనువిందు చేయనున్నాయి. డ్రోన్లతో ఆకాశంలో వివిధ రకాల బొమ్మలు, ఆకృతులు, పేర్లతో షో జరుగుతుంది. ఇప్పటికే నిర్వాహకులు ట్రయల్ రన్‌ను పూర్తి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు కనువిందు చేయనున్నాయి. మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయి.

ఘనంగా ఏర్పాట్లు.. నదీ తీరం వెంబడి డ్రోన్‌షోకు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో నదీతీరాన్ని పరిశుభ్రంగా ఉంచారు. ఘాట్‌కు వెళ్లే మార్గంలో పచ్చని మొక్కలు ఉంచారు. వీఐపీలు, అతిథులు, సాధారణ ప్రజలకు గ్యాలరీలు సిద్ధం చేశారు. సందర్శకులు కూర్చుని కార్యక్రమాన్ని తిలకించేలా గ్యాలరీల్లో కుర్చీలు వేశారు. ఘాట్ పొడవునా భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. విద్యుత్తు దీపాల వెలుగు జిలుగులతో నదీతీరం కోలాహలంగా మారింది. డ్రోన్‌షోతో పాటు లేజర్ లైట్ షో, మ్యూజిక్ బ్యాండ్, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. భవానీ ద్వీపం వద్ద నుంచి బాణసంచా భారీ ఎత్తున కాల్చనున్నారు.


సమ్మిట్‌కు సిద్ధమైన డ్రోన్లను పరిశీలిస్తున్న యువతి

ఆకట్టుకున్న ముందస్తు రిహార్సల్స్... డ్రోన్‌షో విజయవంతానికి నిర్వాహకుల ముందస్తు రిహార్సల్స్ ఆకట్టుకున్నాయి. ఆదివారం, సోమవారం రాత్రి సమయంలో నదీతీరం వెంబడి ట్రయల్ రన్ వేశారు. ఆకాశంలో ఒక్కసారిగా వివిధ రకాల ఆకారాలతో బొమ్మలు కనిపించడంతో నగర వాసులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. నదీతీర ప్రాంతం ఒక్కసారిగా వెలుగు జిలుగులతో నిండిపోవడంతో అలాగే చూస్తుండిపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు, మంత్రులు, అతిథులు వస్తున్న నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం మధ్యాహ్నం నుంచే వెయ్యి మందికి పైగా పోలీసులు బందోబస్తులో ఉన్నారు. వేదికపై అతిథుల ప్రసంగాలను వీక్షించేలా భారీ తెరలు సైతం అమర్చారు. వేలాది డ్రోన్‌లకు ఛార్జింగ్ పెట్టారు. అలాగే ఆకాశంలో వివిధ రకాల ఆకారాలు వచ్చేలా కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ఇచ్చారు.

మంగళగిరిలో ప్రతిష్ఠాత్మక ఏర్పాట్లు..

మంగళగిరి: మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ వేదికగా మంగళ, బుధవారాల్లో అమరావతి డ్రోన్ సమ్మిట్-2024ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. రెండు రోజుల పాటు జరిగే సదస్సుకు ప్రణాళికాయుతంగా సదస్సు విజయవంతమయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నారు. జాతీయ స్థాయిలో జరుగుతున్న కార్యక్రమం కావడంతో భద్రతా పరంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రెండు రోజుల పాటు జరిగే సదస్సులో డ్రోన్ల ఆవశ్యకత, భవిష్యత్తు అవసరాలు, ఆయా రంగాల్లో ఏవిధంగా ఉపయోగించుకోవాలనే అంశాలపై విస్తృత స్థాయిలో చర్చలు జరుగుతాయి. వివిధ రకాల డ్రోన్ల తయారీదారులు వారి ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. వ్యవసాయం నుంచి విపత్తుల వరకు ప్రతి రంగంలోనూ డ్రోన్ల అవసరాలు పెరిగాయి. ఇందుకు అనుగుణంగా తయారు చేసిన డ్రోన్లను ప్రదర్శిస్తారు. దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే డెలిగేట్స్ సదస్సు వేదికగా వారి అభిప్రాయాలను పంచుకోనున్నారు. ఇక్కడ జరిగే సదస్సు ఈ రంగంలో కీలకంగా మారనుంది. ఇక్కడి నుంచే భవిష్యత్తులో డ్రోన్ల వినియోగం, ఇతరత్రా అంశాలపై ఒక స్పష్టత రానుంది. వివిధ ప్రాంతాల నుంచి డెలిగేట్స్ వస్తున్నందున వారందరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. అదే విధంగా ట్రాఫిక్, భద్రతాపరంగా అన్ని చర్యలు పోలీసు శాఖ చేపట్టింది. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు.



ప్రదర్శనకు స్టాళ్లు సిద్ధం

త్రివర్ణ శిల్పికి.. సగర్వ నివాళి



- ❖ బందరు వైద్యకళాశాలకు పింగళి పేరు
- ❖ జీవో విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ❖ ఫలించిన ఎంపీ వల్లభనేని బాలశౌరి కృషి
- ❖ వైకాపా హయాంలో అడుగడుగునా ఆటంకాలు

ఈనాడు, అమరావతి, మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

మచిలీపట్నం వైద్య కళాశాలకు జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య పేరు పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. కృష్ణా జిల్లాకు చెందిన పింగళి పేరును వైద్య కళాశాలకు పెట్టాలంటూ మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి చేసిన ప్రయత్నాలు ఫలించాయి. పింగళి పేరును వైద్య కళాశాలకు పెట్టకుండా గత వైకాపా ప్రభుత్వంలో అడుగడుగునా ఎన్నో ఆటంకాలు సృష్టించారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఇదే విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎంపీ లేఖ రాశారు. వైద్య కళాశాలకు మహనీయుని పేరును పెట్టాలంటూ కోరారు. తాజాగా అక్టోబరు 02న గాంధీ జయంతి సందర్భంగా మచిలీపట్నంలో నిర్వహించిన 'స్వచ్ఛతే సేవ' కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవ్వగా.. ఆ సమయంలో వేదిక పైనుంచే ఎంపీ బాలశౌరి పింగళి పేరు పెట్టాలంటూ విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా వైద్య కళాశాలకు పింగళి పేరు పెడతామంటూ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం.. సోమవారం జీవోను విడుదల చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో 64 ఎకరాల విస్తీర్ణంలో రూ.550 కోట్లతో వైద్య కళాశాల నిర్మాణం జరుగుతోంది. రూ.125 కోట్లతో తొలి విద్యా సంవత్సరానికి అవసరమైన పనులు పూర్తి చేసి 2023 సెప్టెంబరు 1న తరగతులు ఆరంభించారు. పరిపాలన, పరీక్షల విభాగాలు, గ్యాలరీ, విద్యార్థుల వసతి గృహాలు, డిపార్ట్‌మెంట్ బ్లాక్, పరిశోధనశాలలను నిర్మించారు. ప్రస్తుతం 150మంది విద్యార్థులు మొదటి ఏడాది పూర్తి చేసుకుని ద్వితీయ విద్యా సంవత్సరంలోకి ప్రవేశించారు. ఈ ఏడాది కొత్త బ్యాచ్ రావడంతో మిగిలిన భవన నిర్మాణాల పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. ఆసుపత్రి, నర్సింగ్ కళాశాల, టీచింగ్ అండ్ నాన్‌టీచింగ్ క్వార్టర్లు, శవాగారం, బయో వ్యర్థాల నిర్వహణ కోసం భవనాల నిర్మాణం జరుగుతోంది.



మహనీయుని పేరు పెట్టకుండా కుట్రలు..

గత వైకాపా ప్రభుత్వ హయాంలో.. వైద్య కళాశాల ఏర్పాటుకు అనుమతులు, కేంద్రంతో మాట్లాడి నిధులు సకాలంలో విడుదలయ్యేలా ఎంపీ బాలశౌరి కృషి చేశారు. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రిని అనేకసార్లు వైద్య కళాశాల కోసం కలిశారు. కళాశాల నిర్మాణ పనుల పురోగతిపై తరచూ సమీక్షించేవారు. వైద్య కళాశాల ఏర్పాటైన దగ్గర నుంచి పింగళి వెంకయ్య పేరునే పెట్టాలంటూ ఎంపీ కోరుతున్నారు. కానీ ఈ వైద్య కళాశాలకు మహనీయుని పేరు పెట్టకుండా అడ్డుకునేందుకు వైకాపా ప్రభుత్వం, అప్పటి స్థానిక ఎమ్మెల్యే పేర్ని నాని అనేక కుట్రలు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్ తన తండ్రి వైఎస్ఆర్ పేరు కళాశాలకు పెట్టుకోవాలని ప్రయత్నించడం బాధాకరం. దేశమంతా గర్వంగా చెప్పుకొనే పింగళి వెంకయ్య పేరును పెట్టకుండా ఆయన పుట్టిన ప్రాంతంలో తీవ్రంగా అవమానించారు. వైద్య కళాశాలకు వైఎస్ఆర్ పేరును పెట్టినట్టుగా బ్యానర్లు, చిత్రాలను కూడా తయారు చేసి సామాజిక మాధ్యమాల్లో తిప్పారు. కొందరు వైకాపా కార్యకర్తలు అత్యుత్సాహంతో కళాశాల వద్ద కూడా బ్యానర్లు కట్టారు. దీనిని ఎంపీ బాలశౌరి అప్పట్లోనే తీవ్రంగా వ్యతిరేకించారు.

పింగళికి బందరుతో ప్రత్యేక బంధం..

త్రివర్ణ పతాకానికి రూపకల్పన చేసిన పింగళి వెంకయ్యది కృష్ణా జిల్లాలోని భట్లపెనుమర్రు. మచిలీపట్నంతో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉంది. బందరులోని ఆంధ్ర జాతీయ కళాశాలలో అధ్యాపకుడిగా సేవలందించారు. ఆ సమయంలోనే మువ్వన్నెల జెండాను రూపొందించారు. స్వాతంత్ర్యోద్యమంలో బందరు కేంద్రంగానే అనేక పోరాటాలు చేశారు. జాతిపిత మహాత్మాగాంధీకి అత్యంత నమ్మకమైన అనుచరుడిగా పింగళి ఉండేవారు. తెదేపా హయాంలో మచిలీపట్నంలోని రాజుపేటలో ఓ వీధికి ఆయన పేరు పెట్టారు. మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలకు పింగళి పేరు పెట్టడం ద్వారా.. చిరస్థాయిగా నిలిచిపోవాలని ఎంపీ బాలశౌరి అలుపెరగని కృషి చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు..

– వల్లభనేని బాలశౌరి, మచిలీపట్నం ఎంపీ



వైద్య కళాశాలకు పింగళి వెంకయ్య పేరు పెడుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. కళాశాల నిర్మాణ సమయంలోనే ఆయన పేరు పెట్టాలని నిర్ణయించాం. కానీ గత వైకాపా ప్రభుత్వం, ఆ పార్టీ స్థానిక నేతలు అడుగడుగునా అడ్డుకుని రాజకీయం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ మహనీయునికి సముచిత గౌరవం దక్కింది. ప్రభుత్వం వచ్చిన వెంటనే పింగళి పేరు పెట్టాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు లేఖ రాశా. ముఖ్యమంత్రి ఇటీవల మచిలీపట్నం వచ్చినప్పుడు ఇదే విషయం గుర్తుచేయగా వెంటనే హామీ ఇచ్చి.. ఇప్పుడు జీవోను విడుదల చేశారు.

మెరుపు వేగం.. మేటి సాయం..!



- పౌర సేవలకు డ్రోన్లు వినియోగిస్తున్న విజయవాడ నగరపాలిక
- కంకిపాడు, పెనమలూరుల్లో డ్రోన్ ఆధారిత సంస్థలు
- వ్యవసాయంలో ఎరువుల పిచికారీకి ఎక్కువగా వాడకం

ఈనాడు – అమరావతి

నగరాభివృద్ధి, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగాల్లో.. డ్రోన్ల వినియోగం బాగా పెరిగింది. విజయవాడ నగరంలోనూ ప్రస్తుతం ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంల్లో డ్రోన్లను వినియోగిస్తున్నారు. తాజాగా నగరపాలక సంస్థ రెండు అధునాతన డ్రోన్లను కొన్నది. వాటిని వ్యాధుల నివారణకు అవసరమైన మందులను పిచికారీకి వినియోగిస్తున్నారు. త్వరలో మరిన్ని డ్రోన్లను నగరపాలిక కార్యకలాపాల్లో వినియోగించడం ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలను అందించాలనే ప్రణాళికలు రూపొందిస్తున్నారు. విజయవాడ పున్నమిఘాట్‌లో నేటి సాయంత్రం ఐదు వేలకు పైగా డ్రోన్లతో చేపట్టనున్న భారీ ప్రదర్శనకు ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమరావతి కేంద్రంగా ఈనెల 22, 23ల్లో నిర్వహించబోయే డ్రోన్ సమ్మిట్‌లో నగరాభివృద్ధిలో డ్రోన్ల వినియోగంపై ప్రత్యేకంగా చర్చించనున్నారు. నగరాల పరిధిలో ఏఏ రంగాల్లో డ్రోన్లను వినియోగిస్తే పౌరులకు అధునాతన సేవలను అందించవచ్చనే అంశంపై ఇప్పటికే నివేదికలు సిద్ధం చేశారు. విజయవాడ వంటి నగరాల్లో ఇప్పటికే డ్రోన్ల వినియోగం బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో తాజాగా రాష్ట్ర ప్రభుత్వమూ ప్రత్యేకంగా డ్రోన్ల వినియోగం విధివిధానాల రూపకల్పనపై దృష్టిపెట్టడంతో ఈ రంగంలో అనేక అవకాశాలను యువత అందుకోనున్నారు.

పట్టణ ప్రణాళికలో వినియోగం..

విజయవాడ నగరం దినదినాభివృద్ధి చెందుతోంది. పట్టణప్రణాళికా విభాగంలో డ్రోన్ల వినియోగం పెరగనుంది. భవన నిర్మాణాల పర్యవేక్షణతోపాటు 3 డీ మోడల్స్ పరిశీలన, స్థలాల మ్యాపింగ్, స్మార్ట్ సిటీల రూపకల్పనకు చేపట్టాల్సిన చర్యలేంటనేది నిర్ధరించడానికి డ్రోన్ల అవసరం చాలా ఉంటుంది. ప్రధానంగా నగర ట్రాఫిక్ సమస్య పరిష్కారం, మౌలిక సౌదుపాయాల కల్పన, పట్టణాల్లో ఖాళీ స్థలాల పరిశీలనకు డ్రోన్లు ఎంతో ఉపయోగపడతాయి. వీటిపైనా డ్రోన్ సమ్మిట్‌లో చర్చించనున్నారు.

వరదల వేళ ఆత్మీయ నేస్తం

విజయవాడ సింగ్‌నగర్ ప్రాంతాన్ని ఇటీవల బుడమేరు వరద ముంచెత్తిన సమయంలో డ్రోన్లను పెద్ద ఎత్తున వినియోగించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో డ్రోన్లను అద్దెకు తీసుకొచ్చి.. బాధితులకు ఆహారం, నీటిని అందించారు. బోట్లలో వెళ్లి సహాయం చేయలేని ప్రాంతాలకు.. తొలుత డ్రోన్ల ద్వారానే ఆహారం, నీళ్లు, మందులను చేరవేశారు. హెలికాప్టర్లు వచ్చేవరకూ డ్రోన్లే సహాయపడ్డాయి. వరద ముంచెత్తి వారం దాటినా నీళ్లు కాలనీల్లో నిల్వ ఉండటంతో.. డ్రోన్ల సాయంతోనే దోమల నివారణ మందులను పిచికారీ చేశారు. ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉండడంతో ప్రస్తుతం రెండు డ్రోన్లను నగరపాలక సంస్థ కొనుగోలు చేసింది. ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో వీటిని ప్రస్తుతం వినియోగిస్తున్నారు. నీళ్లు నిల్వ ఉండే ప్రాంతాల్లో వీటి ద్వారా మందులు పిచికారీ చేస్తున్నారు.

రైతన్నకు అండదండలు

డ్రోన్ల ఆధారిత సంస్థలు సైతం విజయవాడ, శివారు ప్రాంతాలైన కంకిపాడు, నెప్పల్లి, పెనమలూరుల్లోనూ ఏర్పాటయ్యాయి. ఇంజినీరింగ్ పూర్తిచేసిన యువత సైతం డ్రోన్లపై ఆధారపడే సంస్థలను నెలకొల్పారు. డ్రోన్లను వ్యవసాయంలో ఉపయోగిస్తూ ఆదాయం పొందుతున్నారు. కె.ఎల్.యూనివర్శిటీలో ఇంజినీరింగ్ పూర్తిచేసిన గోపీ రాజా అనే యువకుడు ఏడేళ్ల కిందటే కంకిపాడు కేంద్రంగా డ్రోన్ ఆధారిత సంస్థను నెలకొల్పాడు. ఈ కంపెనీ ఆధ్వర్యంలో డ్రోన్లను అవసరమైన వారికి తయారుచేసి ఇస్తూ.. శిక్షణ సైతం ఇస్తున్నారు. రైతులకు పొలాల్లో మందులను పిచికారీ చేయడానికి సైతం డ్రోన్లను పంపిస్తున్నారు. ఎకరాకు రూ.400 చొప్పున పురుగు మందులు, ఎరువులను పిచికారీ చేయడానికి తీసుకుంటున్నారు. రైతులు సైతం ప్రస్తుతం వీటికి బాగా అలవాటు పడ్డారు. ప్రస్తుతం ఇలాంటి సంస్థలు విజయవాడ శివారు ప్రాంతాల్లో మూడు నాలుగు ఏర్పాటయ్యాయి. తాజాగా జరగబోయే డ్రోన్ సమ్మిట్‌లో గోపీరాజా సంస్థ పాల్గొంటోంది. వ్యవసాయంతోపాటు ఉత్పత్తులను డెలివరీ చేసే కార్గో డ్రోన్‌లను ఈ సమ్మిట్‌లో భాగంగా మంగళగిరి సి.కె. కన్వెన్షన్‌లో ప్రదర్శించబోతున్నట్లు గోపీ రాజా వెల్లడించారు.


పంటలపై ఎరువుల పిచికారీకి డ్రోన్ వినియోగం

దసరా ఆదాయం రూ.9.31 కోట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల సందర్భంగా దుర్గగుడి హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను మూడు విడతల్లో మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో లెక్కించగా రూ.9.31కోట్లు ఆదాయం వచ్చింది. మొదటి విడతలో రూ.3.50కోట్లు, రెండో విడతలో రూ.2.76కోట్లు, మూడో విడతలో రూ.3.05 కోట్ల కానుకలు వచ్చాయని ఆలయ ఈవో రామారావు సోమవారం తెలిపారు. మూడు విడతల్లో బంగారం 733 గ్రాములు, 25.705 కిలోల వెండి వస్తువులను భక్తులు మొక్కుల రూపంలో చెల్లించారు. కానుకల లెక్కింపును ఈవోతోపాటు డిప్యూటీ ఈవో రత్నంరాజు సీసీ కెమెరాల్లో వన్‌టౌన్ పోలీసులు, ఎస్‌పీఎఫ్, దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది పర్యవేక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న దేవస్థానం ఉద్యోగులు, సేవా సిబ్బందికి దేవస్థానం లడ్డూతోపాటు అన్నప్రసాదాన్ని అందజేశారు.


కానుకలు లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది

ఇసుక కొరత.. ప్రజల కలత

కంకిపాడు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చి వంద రోజులైనా ధరలో పెద్దగా మార్పులేదు. దీనికి ప్రధాన కారణం వరుస వరదలేనని భావిస్తున్నారు. ఈ ఏడాది జులై నుంచి ఇప్పటి వరకు సంభవించిన వరదల తీవ్రత గత 50 ఏళ్లలో ఎప్పుడూ ఎదురవ్వలేదని నదీ పరివాహక ప్రాంతాల వాసులు చెబుతున్నారు. ప్రవాహానికి క్వారీ రహదారులు నీటిలో కొట్టుకుపోతున్నాయి. వీటిని ఏర్పాటు చేయడానికి రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చవుతోంది. దీంతో లంక భూముల, కరకట్టకు సమీపంలో పరిమిత పరిమాణంలో ఉన్న ఇసుకనే ఎడ్ల బళ్ల ద్వారా బయటకు తీసుకువస్తున్నారు. ఇది అవసరానికి తగ్గట్టు లేదు. తాజాగా నదిలో వరద చేరడంతో ఉన్న క్వారీలు కూడా మూసుకుపోయి ఇసుక కొరత ఏర్పడింది. ఇళ్లు, భవనాల నిర్మాణాలు చేపట్టిన వారు కలత చెందుతున్నారు.



మద్దూరు ప్రాంతంలో ఇసుక



గత నెలలో వచ్చిన వరదకు దెబ్బతిన్న క్వారీ దారి

క్వారీలు పూర్తి స్థాయిలో నిర్వహిస్తేనే సమస్య తీరేది

జిల్లాలో పెనమలూరు నియోజకవర్గం నుంచి నాగాయలంక వరకు 25 నదీ పరివాహక గ్రామాలున్నాయి. వీటిలో క్వారీలకు అనువైనవి 14 కాగా అధికారులు ఎనిమిది ప్రాంతాల నుంచి ఇసుక రవాణా చేస్తున్నారు. పెదపులిపాక, చోడవరం, మద్దూరు, సమీప రొయ్యూరు, వల్లూరుపాలెం క్వారీల్లో అందుబాటులో ఉంది. నిబంధనల మేరకు 17వ తేదీ వరకు ఎడ్ల బళ్లతోనే ఇసుక తోలకానికి అనుమతి ఉంది. బయటకు తెచ్చిన తర్వాత ట్రాక్టర్లతో ఎగుమతి చేశారు. ప్రస్తుతం అది నిలిచింది. ఇక రేవులో నుంచి తెచ్చేసే భవన నిర్మాణదారులకు అందుబాటులో ఉంటుంది. ఈ పరిస్థితిలో కొద్ది పరిమాణంలో నిల్వ ఉంచిన ఇసుకను అత్యవసర పనులు చేపట్టేవారు అధిక ధర వెచ్చించాల్సి వస్తోంది.

వరుస వరదలతో మూసుకుపోతున్న క్వారీలు

నదీ పరివాహక ప్రాంతాల్లో కొట్టుకుపోతున్న రహదారులు

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

ఎడ్లబళ్లతో పాటు ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేసుకోవచ్చనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇక వినియోగం స్వేచ్ఛగా చేసుకునే అవకాశం లభించడంతో ఇప్పటి వరకు ట్రాక్టర్లు, టిప్పర్లతో రవాణాకు ఎదురవుతున్న ఇబ్బందులు తొలగిపోయాయి. అన్ని వర్గాల కార్మికులకు ఉపాధి లభిస్తుందని ఆశిస్తున్నారు. వరద ప్రభావం తగ్గి క్వారీల నిర్వహణ గాడిలో పడితే కనీస ధరకే ఇసుక అందుబాటులో ఉంటుందని అంచనా వేస్తున్నారు.

స.హ. చట్టం సజావుగా అమలు చేయండి

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే : జిల్లాలో సమాచార హక్కు చట్టం సజావుగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స.హ. చట్ట అమలు తీరును కలెక్టర్ పర్యవేక్షిస్తుంటారని, డీఆర్వో నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. గృహనిర్మాణాల నిమిత్తం ప్రైవేటు భూముల సేకరణకు సొసైటీ ఏర్పాటు చేసేందుకు అడ్‌హక్ కమిటీని నియమించాలని ఆదేశించారు. కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి కార్యాలయం వచ్చే అర్జీలకు ప్రాధాన్యం ఇచ్చి సకాలంలో పరిష్కారం చూపాలని చెప్పారు. జిల్లా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరించారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో చంద్రశేఖరరావు, డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి

☛ మండవల్లి మండల పరిధిలోని మేజర్ గ్రామ పంచాయతీ దాలిపర్రులో 1,550 మంది జనాభా ఉన్నారని, పల్లెపండగలో భాగంగా గ్రామాభివృద్ధి కోసం ఇస్తామన్న రూ.12 లక్షలు విడుదల కాలేదని, వెంటనే ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు మిక్కిలినేని మధు, నాగేశ్వరరావు తదితరులు వినతిపత్రం అందచేశారు.

☛ బంటుమిల్లి మండలం ముంజులూరు పంచాయతీ శివారు రామన్నమోడి సొసైటీ పరిధిలోని మల్లంపూడిమ్మ చెరువును సొసైటీ పాలకవర్గానికి తెలియనీయకుండా లీజుకు ఇచ్చిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సొసైటీ అధ్యక్షులు టి.శ్రీనివాసరావు, తదితరులు ఫిర్యాదు చేశారు.

☛ గేదె విద్యుదాఘాతంతో మృతి చెందిందని, బీమా ప్రమేయం చెల్లించాలని పరిహారం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని, తన న్యాయం చేయాలని మొవ్వ మండలం మంత్రిపాలెంకు చెందిన రూప కోరారు.

☛ బుడమేరు వరద కారణంగా చాగంటిపాడు నుంచి కొయ్యగూరపాడు వరకూ ముంపు బారిన పడిన పొలాల్లోని సిటీ మోటార్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, వాటి మరమ్మతుల కోసం ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఉంగుటూరు మండలం లంకపల్లి, ముక్కపాడు గ్రామాల రైతులు శివకోటేశ్వరరావు తదితరులు అర్జీ సమర్పించారు.

దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

మచిలీపట్నం(గొడుగుపేట): డీఎస్సీ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగించినట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి షేక్ షాహిద్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 21తో ముగియడంతో ఎక్కువమంది వినియోగించుకోవాలన్న లక్ష్యంతో ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించారన్నారు. జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కేఆర్‌యూ పరీక్షల ఫలితాల విడుదల

కృష్ణావిశ్వవిద్యాలయం(మచిలీపట్నం): కృష్ణా విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల పరిధిలోని వివిధ పరీక్షల ఫలితాలను ఉపకులపతి ఆర్.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సోమవారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.వీరబ్రహ్మచారి తెలిపారు. ఎల్ఎల్‌బీ, బీపీ నాలుగు, ఎనిమిదో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసామన్నారు. ఫలితాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలని సూచించారు. పునఃమూల్యాంకనం కోసం ఈ నెల 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

జెట్టీలు ఏర్పాటు చేయాలి

నాగాయలంక: నాగాయలంక, ఏటిమొగల గ్రామాల్లో చేపల బోట్లు నిలిపేందుకు వీలుగా జెట్టీలు నిర్మించాలని రాష్ట్ర సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు రాష్ట్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన పడవల రేవును పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. నాగాయలంక కేంద్రంగా 200లకు పైగా చేపల వేట చేసే బోట్లు ఉన్నాయన్నారు. వాటిని నిలిపేందుకు జెట్టీ లేకపోవడంతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎంపీ బాలశౌరీ సమస్యను కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. మత్స్య సహకార సంఘం డైరెక్టర్ కర్రి కృష్ణమూర్తి, స్థానిక మత్స్యకార సంఘాల నాయకులు కొల్లు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి డీపీఆర్టీయూ ముందుంటుందని, ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు, ఇతర సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను అన్నారు. అవనిగడ్డలోని ఎస్‌వీఎల్ కళాశాల ప్రాంగణంలో సంఘం ప్రాంతీయ సమావేశం అధ్యక్షులు జీవీఎస్ పెరుమాళ్ల అధ్యక్షతన సోమవారం జరిగింది. ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.

నైపుణ్య శిక్షణతోనే యువతకు ఉపాధి



మాట్లాడుతున్న డైరెక్టర్ పరదేశి, వేదికపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తదితరులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: నైపుణ్య శిక్షణతోనే ఉపాధి అవకాశాలు అధికంగా లభిస్తాయని.. ఆర్థికాభివృద్ధి దిశగా దూసుకెళ్తున్న భారత్‌లో యువత తదనుగుణంగా అడుగులు వేయాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్టులో శిక్షణ పొందుతున్న యువతతో ఆయన సోమవారం ముఖాముఖి నిర్వహించి మాట్లాడారు. 'యువత నూతన సాంకేతికత, విధానాలను అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. కులం, మతం కన్నా ఉత్తమ గుణంతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని తెలిపారు. అందుకు నిదర్శనమే దేశ ఉన్నతస్థానాల్లో ఉన్న తెలుగు వారని పేర్కొన్నారు. ఇతర భాషలు నేర్చుకోవాలి కానీ మాతృభాషలో మాట్లాడడాన్నే గర్వంగా యువత భావించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యాయామం అలవాటు చేసుకోవాలని చెప్పారు. మాతృభాష, దేశభక్తిని ఎప్పటికీ మరవద్దని, వాటిపై మన ప్రేమను మరింత చూపాలన్నారు. గ్రామీణ యువత సాధికారతే లక్ష్యంగా సేవలందిస్తున్న స్వర్ణ భారత్ లాంటి సంస్థలను వినియోగించుకొని జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ట్రస్టు ఛైర్మన్ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, డైరెక్టర్ పరదేశి తదితరులు పాల్గొన్నారు.

భోజనం బాగుందా.. బోధన ఎలా ఉంది?

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : భోజనం బగుందా.. బోధన ఎలా ఉంది అంటూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీఆర్ కృష్ణయ్య విద్యార్థులను ఆరా తీశారు. సోమవారం ఆయన ఆయన నగరంలోని జార్జికారనేషన్, దేశాయిపేట, జైహింద్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనం పథక నిర్వహణ తీరును పరిశీలించారు. భోజనం బావుంటుందా.. మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా తదితర అంశాలపై విద్యార్థులతో మాట్లాడారు. నాణ్యతా లోపాలున్నా, ఇతర సమస్యలున్నా న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావచ్చన్నారు. విద్యార్థులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యాయవాది అజ్మతున్నీసా, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం లక్ష్మణరావుపురంలోని బ్రిడ్జ్ ఆఫ్ యునైటెడ్ ఇండియన్స్ ఫర్ లైఫ్ డెవలప్‌మెంట్ చిల్డ్రన్స్ హోంను సందర్శించి అక్కడ పరిస్థితులను పరిశీలించారు.



దేశాయిపేట పాఠశాలలో భోజన నిర్వహణ తీరును పరిశీలించి విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

యార్లగడ్డ చొరవతో.. సమస్య పరిష్కారం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: 'ప్రజారోగ్యంతో ప్రభుత్వం చెలగాటం ఆడటం తగదని.. తెదేపా అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో గన్నవరం చెత్త సమస్యకు పరిష్కారం చూపుతా'నని గతేడాది నవంబరు 16, గన్నవరం ప్రజలకు ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రస్తుత ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హామీ ఇచ్చారు. చెప్పిన మాట ప్రకారం.. గుంటూరు నగర శివారులోని జిందాల్ విద్యుత్తు ఉత్పాదన సంస్థతో చర్చలు జరిపిన ఆయన.. పట్టణంతో పాటు, కేసరపల్లి, బుద్ధవరం పంచాయతీల నుంచి వచ్చే వ్యర్థాలను తరలించేలా చర్యలు చేపట్టారు. చెత్త తరలించేందుకు మూడు పంచాయతీల నిధుల నుంచి రూ. 55 లక్షల వ్యయంతో సుమారు 8 టన్నుల చెత్త, ఇతర వ్యర్థాలను తరలించే వాహనాన్ని కొనుగోలు చేశారు. ఆ వాహనాన్ని జిల్లా పంచాయతీ అధికారిణి అరుణ, ఎంపీడీవో స్వర్ణలత, సర్పంచి ఎన్.సౌజన్య, ఉపసర్పంచి పి.నాని, ఈవో కేశవరావుతో కలిసి సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గన్నవరం దీర్ఘకాల చెత్త సమస్యకు పరిష్కారం దొరికిందన్నారు. గన్నవరం-ఆగిరిపల్లి ప్రధాన మార్గంలో రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారు లేకపోలేదన్నారు. సమస్యకు పరిష్కారం కావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాయకులు దొంతు చిన్నా, మూల్పూరి కల్యాణి, జె.వెంకటేశ్వరరావు, కె.సుధీర్, ఎం.వెంకటేశ్వరరావు, పి.రంగారావు, జి.బాబూరావు, జనసేన, భాజపా నాయకులు చిమటా రవివర్మ, అన్నపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెత్త తరలింపు వాహనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వెంకట్రావు తదితరులు

ఆడపిల్లలు పుట్టారని అత్తింటి వేధింపులు

జిల్లా పోలీస్ కార్యాలయానికి 35 ఫిర్యాదులు

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం వివిధ ప్రాంతాలకు చెందిన వారు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫిర్యాదులు సమర్పించారు. ఇద్దరు ఆడపిల్లలకు జన్మనిచ్చానన్న కారణంగా అత్తింటివారు తీవ్ర వేధింపులకు పాల్పడుతున్నారని గుడ్లవల్లేరు ప్రాంతానికి చెందిన మహిళ, భార్య మరణించడంతో ఒంటరినైన తనను పెద్ద కుమారుడు ఆస్తి రాసివ్వాలంటూ ఇబ్బందుల పాల్జేస్తూ భోజనం పెట్టడం లేదని పమిడిముక్కలకు చెందిన వృద్ధుడు నాగయ్య, బంధువులకు అప్పుగా ఇచ్చిన రూ.2 లక్షలు తిరిగి ఇవ్వకపోగా అడిగితే బెదిరిస్తున్నారని మోపిదేవి ప్రాంతానికి చెందిన వంశీ ఫిర్యాదులు అందజేశారు. 35 ఫిర్యాదులను స్వయంగా పరిశీలించిన ఎస్పీ గంగాధరరావు వాటిని విచారించి చట్ట పరిధిలో తగు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ గంగాధరరావు

చంద్రబాబు, పవన్, లోకేశ్‌లపై వికృత పోస్టులు పెట్టిన కేసులో..

ఇంటూరి రవికిరణ్ అరెస్టు.. బెయిలు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యా మంత్రి లోకేశ్‌లపై అత్యంత అసహ్యంగా సోషల్ మీడియాలో వికృత పోస్టులు పెడుతూ ఆనందించే విశాఖపట్నంకు చెందిన ఇంటూరి రవికిరణ్‌ను కృష్ణా జిల్లా గుడివాడ వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించగా.. న్యాయమూర్తి అతడికి బెయిలు మంజూరు చేశారు. తెదేపా సోషల్ మీడియా కన్వీనర్ అసిలేటి నిర్మల ఆగస్టు 17న ఇంటూరి రవికిరణ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌లపై తీవ్ర అసభ్య పదజాలంతో అసహ్యంగా కార్టూన్లు సృష్టించి ఎక్స్ వేదికగా రవికిరణ్ వికృత పోస్టులు పెట్టినట్టు నిర్మల ఫిర్యాదులో పేర్కొన్నారు. జుగుప్సాకర పోస్టులతో నాయకుల ఫొటోలను అవమానకరంగా మార్ఫింగ్ చేసి శునకానందం పొందుతున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని నిర్మల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో రవికిరణ్‌ను గుడివాడ వన్‌టౌన్ పోలీసులు విశాఖపట్నంలో ఆగస్టు 31న అదుపులోకి తీసుకోవడం జరిగిందని అదే రోజు ఆయనకు 41 సీఆర్‌పీసీ నోటీసు ఇచ్చి పంపామని వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ నేపథ్యంలో సెప్టెంబరు ఒకటో తేదీన మాజీ మంత్రి పేర్ని నాని, మాజీ ఎమ్మెల్యే కైలే అనీల్‌కుమార్‌లు రవికిరణ్‌ను పరామర్శించేందుకు రాగా జనసేన నేతలు నిరసన వ్యక్తం చేసిన విషయం విదితమే. సోమవారం రవికిరణ్‌ను అరెస్టు చేసి కోర్టుకు తరలించగా.. రూ.10 వేలు నగదు, ఇద్దరి పూచీకత్తులపై అతడికి న్యాయమూర్తి బెయిలు మంజూరు చేశారని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 138, 147, 158 చికెన్ విత్ స్కిన్ - 266 చికెన్ స్కిన్‌లెస్ - 276.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 530 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ప్రాణం తీసిన అతివేగం

కారు ఢీకొని ద్విచక్రవాహదారుడి మృతి

తుళ్లూరు, న్యూస్‌టుడే: మితిమీరిన వేగం, నిర్లక్ష్యం ఒక నిండు ప్రాణం గాల్లో కలిసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..విజయవాడ ప్రసాదంపాడుకు చెందిన బి.రాము (50) బిల్డర్‌గా కుటుంబాన్ని పోషిస్తున్నారు. సోమవారం తుళ్లూరు మండలంలోని తాళ్లాయపాలెం శైవక్షేత్రంలో పూజలు నిర్వహించి తిరిగి సీడ్‌యాక్సెస్ రహదారిపై ఇంటికి బయలుదేరారు. రోడ్డుకు ఎడమవైపు మార్జిన్‌లో బైక్ నడుపుతున్నారు. అదే సమయంలో కొండపల్లికి చెందిన ఎ. హర్షవర్ధన్ కారులో విజయవాడ వైపు నుంచి అతి వేగంగా వస్తున్నాడు. వెంకటపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న వాహనాన్ని దాటించే క్రమంలో కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి డివైడర్ పైకి దూసుకుపోయింది. ఈ ఘటనలో రాము తల డివైడర్‌కు తగిలి తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనం అక్కడకు చేరుకునే సరికే ఆయన మృతి చెందారు. మృతుడికి ఒక కూమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రమాదం జరిగిన చోట బందోబస్తు కోసం వచ్చిన పోలీస్ కానిస్టేబుల్ కూర్చొని ప్రమాదానికి ముందు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో ఆయనకు త్రుటిలో ప్రమాదం తప్పింది. కారు ముందు భాగం ధ్వంసం కాగా.. కారు నడుపుతున్న హర్షవర్ధన్‌కు గాయాలేమీ కాలేదు. ట్రాఫిక్ తుళ్లూరు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నుజ్జునుజ్జయిన ద్విచక్రవాహనం

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదు కావాలి

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే : త్వరలో నిర్వహించనున్న కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులు ఓటు నమోదు చేసుకోవాలని జేసీ గీతాంజలిశర్మ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కోసం బందరు ఆర్డీవో స్వాతి ఆధ్వర్యాన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాన్ని సోమవారం జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావులు సందర్శించారు. ఓటర్లుగా నమోదయ్యేందుకు వారిద్దరూ ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలోని అన్ని తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు గడువు నవంబరు 6 వరకూ మాత్రమే ఉంటుందన్న విషయాన్ని గమనించాలని కోరారు.



ఫారం-18 పూర్తి చేస్తున్న జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో చంద్రశేఖర్

మడకలో డ్రైవర్ హత్య

పెడన, న్యూస్‌టుడే : మద్యం మత్తులో ఇద్దరి మధ్య ఏర్పడిన ఘర్షణ ఒకరి హత్యకు దారితీసింది. మండలంలోని మడకలో 216 జాతీయ రహదారి పక్కగా ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటన సంచలనం సృష్టించింది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దాడ ఆశీర్వాదం(34) మచిలీపట్నంలోని ఒక ట్రావెల్స్ సంస్థలో డ్రైవర్‌గా పనిచేస్తారు. తన స్నేహితులు జోగి ఆమోష్, అల్లాడి వీరబాబు, బొర్రా రమేష్, జూపూడి కామేశ్వరరావులతో కలిసి గ్రామంలో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం మొదటి అంతస్తులో ఆదివారం రాత్రి మద్యం తాగారు. తర్వాత ఆశీర్వాదం, జోగి ఆమోష్‌ల మధ్య నగదు విషయమై వివాదం ఏర్పడి ఘర్షణ పడ్డారు. ఆ సమయంలో ఆశీర్వాదం ఛాతిపై ఆమోష్ కాలితో బలంగా కొట్టాడు. ఆశీర్వాదం కుప్పకూలిపోగా సహచరులు సమీపంలోని ఆయన ఇంటికి చేర్చారు. అప్పటికే ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో భార్య పవిత్ర ఆటోలో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో రాత్రి 11 గంటల ప్రాంతంలో మృతి చెందారు. తన భర్త గతంలో గుండె సంబంధిత ఆపరేషన్ చేయించుకున్నారని నిందితుడు ఆమోష్ ఛాతిపై బలంగా కొట్టడంతోనే మృతి చెందాడని భార్య ఆరోపించారు. ఈ దాడిలో మరో ముగ్గురు కూడా ఉన్నారని ఆరోపించారు. సోమవారం ఘటన స్థలాన్ని సందర్శించిన రూరల్ సీఐ నాగేంద్ర ప్రసాద్ బాధిత కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. భార్య ఫిర్యాదు మేరకు జోగి ఆమోష్‌పై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మచిలీపట్నం డీఎస్పీ షేక్ సుభాని సంఘటనా స్థలాన్ని సందర్శించారు. దాడిలో నిందితుడు ఆమోష్‌కు కూడా గాయాలు కావడంతో మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.



కుటుంబ సభ్యులను విచారిస్తున్న రూరల్ సీఐ



ఆశీర్వాదం (పాతచిత్రం)

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

ప్రతిభ చాటేందుకు పోటీలు దోహదం


బహుమతులు సాధించిన విద్యార్థినులతో కరస్పాండెంట్ తదితరులు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : ప్రతిభ చాటేందుకు పోటీలు దోహదపడతాయని నగరంలోని శ్రీ రామకృష్ణ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణ అన్నారు. సోమవారం పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు'.. 'విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోటీల్లో ఎన్. ప్రసన్నలక్ష్మి(10వ తరగతి), బి. జెన్విత్‌శ్రీభువన(9వ తరగతి), ఎం. అఖిల(8వ తరగతి)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు కరస్పాండెంట్‌తోపాటు ప్రిన్సిపల్ సిహెచ్. సంధ్యారాణి బహుమతులు అందజేశారు.

మెడికల్ కళాశాలకు పింగళి పేరు హర్షణీయం


మాట్లాడుతున్న తెదేపా లీగల్‌సెల్ నేతలు

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే : మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలకు పింగళి వెంకయ్య పేరు పెట్టడం హర్షణీయమని తెదేపా లీగల్ సెల్ నాయకులు అన్నారు. సోమవారం స్థానిక సిడింబి అగ్రహారంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహనీయులకు గుర్తింపు తెచ్చే విధంగా కూటమి ప్రభుత్వం జాతీయపతాక రూపశిల్పి పింగళి పేరు పెట్టిందన్నారు. వైకాపా ప్రభుత్వ పాలనలో మహనీయులను విస్మరించారని మండిపడ్డారు. దివంగత భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి ఎంపీ బాలశౌరి కృషి చేయగా అప్పటి శాసనసభ్యుడు పేర్ని నాని, మున్సిపల్ పాలకవర్గం కౌన్సిల్లో తీర్మానం కాకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. పాలకవర్గం మారిన వెంటనే మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి పట్టాభి భవనానికి అనుమతులు ఇప్పించి నిర్మిస్తారన్నారు. సమావేశంలో తెదేపా లీగల్‌సెల్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు మాదివాడ వెంకటనరసింహారావు, ఉపాధ్యక్షుడు అద్దేపల్లి నిరంజనరావు, తెదేపా జిల్లా ప్రచార కార్యదర్శి పి.వి. ఫణికుమార్, డాక్టర్ బొల్లా ప్రసాదరావు పాల్గొన్నారు.

మలుపులో జాగ్రత్త..



గుండుపాలెం(మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే : బందరు మండలం గుండుపాలెంలో గుంత వాహనదారుల పాలిట ప్రమాదకరంగా మారింది. గుండుపాలెం హైస్కూల్ నుంచి చిన్నాపురం వెళ్లే మలుపులో రహదారి తవ్వేశారు. గుంతను సరిగా పూడ్చకపోవటంతో చోదకులకు తిప్పలు తప్పడం లేదు. గుంతను గమనించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

తీరనున్న రైతుల కష్టాలు

డొంక రోడ్ల అభివృద్ధికి చర్యలు

మచిలీపట్నం(గొడుగుపేట), గూడూరు, న్యూస్‌టుడే

గ్రామాలను అనుసంధానించడంతోపాటు వ్యవసాయ అవసరాలకు అత్యవసరమైన డొంక రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెదేపా హయాంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతోపాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులతో ఈ మార్గాలను అభివృద్ధి చేసేవారు. వైకాపా ప్రభుత్వం వీటి గురించి అస్సలు పట్టించుకోకపోవడంతో చాలా చోట్ల అస్తవ్యస్తంగా మారాయి. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం డొంక మార్గాలను అభివృద్ధి చేసేలా కార్యాచరణ చేపట్టింది.

అధ్వానంగా.. బురదమయంగా

☛ మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో అన్ని చోట్లా అంతే అన్నట్లు పరిస్థితి తయారైంది. రెండు నియోజకవర్గాల పరిధిలోని 85 వేల ఎకరాలకుపైగా వ్యవసాయ ఆయకట్టు ఉంది. ఈ పొలాలకు వెళ్లాలన్నా ఏవి తరలించాలన్నా ఈ రోడ్లనే ఆశ్రయిస్తారు.

☛ గూడూరు మండలంలోని మల్లవోలు పంచాయతీ పరిధిలోని గుండుపాలెం డొంక రోడ్డు అభివృద్ధి చేయాలని గ్రామస్థులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. డొంక మధ్యలో ఉన్న వంతెన కూడా శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. కంకటావ పంచాయతీ పరిధిలోని కత్తులవానిపాలెం నుంచి గూడూరు ప్రధాన రహదారికి కలిపే డొంక మరింత అధ్వానంగా మారిపోయింది. ఆర్వీపల్లి-పెడన రోడ్డు సమస్యను పలుమార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది.


బందరు మండలంలోని చిట్టిపాలెంలో అధ్వానంగా ఉన్న డొంక రోడ్డు

☛ కృత్తివెన్ను మండలంలో సంగమూడి, నీలిపూడి, వాలంక, పీతలావ, పడతడిక, దండుదారి తదితర గ్రామాల్లో రోడ్లు రూపు కోల్పోయాయి. బందరు మండలంలోని చిన్నాపురం, గుండుపాలెం, భోగిరెడ్డిపల్లి, నెలకుర్రు ఇలా పలు గ్రామాల్లోని డొంకలు అస్తవ్యస్తంగానే ఉన్నాయి.

☛ బందరు మండలంలోని చిట్టిపాలెం నుంచి మచిలీపట్నం వచ్చేందుకు పొలాలమధ్యలో డొంక రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. గూడూరు మండలంలోని గండ్రం నుంచి ముక్కొల్లు రోడ్డు కూడా బురదతో నిండిపోయింది. ప్రస్తుతం ఆరహదారుల వెంట రాకపోకలు సాగించాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు.

ప్రతిపాదనలు చేసి.. పట్టించుకోకుండా వదిలేసి

గతంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులను డొంకరోడ్ల నిర్మాణానికి వినియోగించేవారు. కానీ వైకాపా ప్రభుత్వం ఆ నిధులను సచివాలయాలు, ఇతర భవనాలకు వినియోగించింది. ప్రతి ఏటా మార్కెట్ కమిటీల నుంచి డొంకరోడ్ల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించేవారు. ఎన్నికలకు ముందు పెడన మార్కెట్ కమిటీ పరిధిలో రూ.3.76 కోట్లు, బంటుమిల్లి మండలంలోని మలేశ్వరం మార్కెట్ కమిటీ పరిధిలో రూ.3.62కోట్లతో వివిధ గ్రామాల్లో రహదారులను నిర్మించేందుకు ప్రతిపాదనలు చేశారు. కానీ అవి ప్రతిపాదనలకే పరిమితం అయ్యాయి. నిధులు మాత్రం విడుదల కాలేదు. కేవలం డొంక రోడ్ల సమస్యతోనే చాలామంది గత ఖరీఫ్‌లో పంటను పొలాల్లోనే కుప్పలుగా వేయడంతో వర్షాలకు నీరుచేరి నష్టపోవాల్సి వచ్చింది. ఇలా రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా డొంకరోడ్ల అభివృద్ధిచేసేందుకు చర్యలు తీసుకుంది. కూటమి ప్రభుత్వం హయాంలో రోడ్లు అభివృద్ధి చెందుతాయని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.


గూడూరు మండలంలో బురదమయంగా గండ్ర నుంచి ముక్కొల్లు వెళ్లే మార్గం


గూడూరు మండలంలోని ఆర్వీపల్లి నుంచి పెడన వెళ్లే డొంక రహదారి

శిక్షణ తరగతులు వినియోగించుకోవాలి


వేణుని సత్కరిస్తున్న కళాశాల డీన్, ప్రిన్సిపల్ తదితరులు


హాజరైన విద్యార్థులు

కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం), న్యూస్‌టుడే : ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన శిక్షణ అందిస్తున్నందున విద్యార్థులు వినియోగించుకోవాలని కృష్ణావిశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్. విజయకుమారి అన్నారు. వారంరోజులపాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఉపకులపతి ఆర్. శ్రీనివాసరావు చొరవతో జావా, పైథాన్ లాంటి పలు కోడింగ్ అంశాలపై ఉచితంగా శిక్షణ అందించేలా చర్యలు తీసకున్నామన్నారు. టాలెంట్ షైన్ ఇండియా సంస్థ సీఈవో వేణు పాల్గొని శిక్షణ అందించారు. అనంతరం వేణుని సత్కరించారు. ఇంజినీరింగ్ కళాశాల డీన్ వైకె సుందరకృష్ణ తదితరులు ప్రసంగించారు.

కూటమి అభ్యర్థి ఆలపాటి విజయానికి కృషి


మాట్లాడుతున్న ఆదినారాయణ, తదితరులు

మచిలీపట్నం(కోనేరుసెంటరు): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు అఖండ విజయం చేకూర్చాలని తెదేపా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ కోరారు. పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పట్టభద్రులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకులు వసంతకుమారి, నరేష్, వెంకటరత్నం, అశోక్, మణికుమార్ సమావేశంలో పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా చేర్చుదాం


మున్సిపల్ కార్యాలయంలో హాజరైన ఉద్యోగులు

పెడన, న్యూస్‌టుడే: పట్టభద్రులు ఓటర్లుగా నమోదు కావాలని అధికారులు పేర్కొన్నారు. 2021 నవంబరు 1 నాటికి డిగ్రీ పూర్తి చేసిన గ్రాడ్యుయేట్లను 2025 మార్చి 25న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లుగా చేర్చాలని ఇన్‌ఛార్జి తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో సోమవారం వేర్వేరుగా జరిగిన ఉద్యోగుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. నవంబరు 6వ తేదీలోపు ఓటర్ల జాబితాలో చేర్చాలని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో చేర్చేందుకు అవకాశం ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, ఎంపీడీవో ఇన్‌ఛార్జి జయరాం, ఎన్నికల సెల్ డీటీ ఎంవీఎస్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి మృతికి సంతాపం

మచిలీపట్నం (గొడుగుపేట),న్యూస్‌టుడే : అలహాబాదు హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అంబటి లక్ష్మరావు మృతికి ఎన్నికల నిఘావేదిక సంస్థ ప్రతినిధులు వి. హేమసుందరరావు, అంకెం జితేంద్ర, వి. భవానీశంకర్ ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. ఆయన పదవీ విరమణ అనంతరం అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. అవినీతి నిర్మూలన, రైతు సంక్షేమం, మద్యం నియంత్రణ తదితర సామాజిక అంశాలపై కృషి చేశారని, ప్రధానంగా ఎన్నికల్లో సంస్కరణల కోసం విశేష కృషి చేశారంటూ కొనియాడారు.

ప్రగతి దిశగా పల్లెల పయనం


బల్లిపర్రులో రహదారి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు నగేశ్, పక్కన తదితరులు

పెడన, పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని జడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకట నగేశ్ అన్నారు. పల్లె పండగ సందర్భంగా పెడన మండలంలో రూ.3.78కోట్ల విలువైన 44 సిమెంటు రోడ్ల నిర్మాణానికి అధికారులు, కూటమి నేతలతో కలిసి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో జయరాం, పంచాయతీ రాజ్ ఏఈ ధర్మయ్య, మండల తెదేపా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, శీలం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి లోకం ఉద్యమాలకు సిద్ధం కావాలి


సంఘ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు, విద్యార్థులు

మచిలీపట్నంకార్పొరేషన్, న్యూస్‌టుడే : విద్యార్థి లోకం ఉద్యమాలకు సిద్ధం కావాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.శివారెడ్డి పిలుపునిచ్చారు. మచిలీపట్నంలో బెల్ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమాఖ్య జిల్లా మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టాలన్నారు. ఉన్నత చదువులకు శాపంగా మారిన జీవోనెం77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నభోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. నవంబరు 27 నుంచి 30వరకు విజయనగరంలో జరిగే సమాఖ్య 49వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ విద్యాదీవెన పథకం బకాయిలు విడుదల చేయాలన్నారు. తొలుత సంఘ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా సంఘ జిల్లా నూతన కమిటీని నియమించారు. సంఘ అధ్యక్షుడిగా నాని, కార్యదర్శిగా సాధిక్‌బాబు, ఉపాధ్యక్షుడు జాస్మిన్, లక్ష్మి, ప్రత్యూష, లక్ష్మీప్రియ, సహాయ కార్యదర్శులు ఝాన్సీ, మౌనిక, సన్నీ, రెహమాన్, కోశాధికారి అనితతోపాటు పలువురు సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. పలువురు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పోలీస్ బ్యాండ్ ప్రదర్శన



వివిధ రకాల వాయిద్యాలతో గీతాలు ఆలపిస్తున్న పోలీసులు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే : పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం నగరంలోని కోనేరు సెంటరులో నిర్వహించిన పోలీస్ బ్యాండ్ ప్రదర్శన అలరించింది. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి సేవలను ప్రజలకు తెలియజేస్తూ వివిధ దేశభక్తి గీతాలు ఆలపించారు. లఘు చిత్రాలు ప్రదర్శించారు. ఏఎస్పీ ఎస్‌వీడీ ప్రసాద్ పర్యవేక్షించగా పలువురు అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

? నగరంలోని దేవునిచెరువు వినాయక గుడి ప్రాంతంలోని అంతర్గత రహదారి అధ్వానంగా మారింది.

- వారణాసి మారుతి, దేవునిచెరువు

✔ నగరంలోని పలు అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశాం. ప్రాధాన్య క్రమంలో రహదారులన్నీ అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం.

- బాపిరాజు, నగరపాలకసంస్థ కమిషనర్, మచిలీపట్నం

– మచిలీపట్నం(గొడుగుపేట), గూడూరు, న్యూస్‌టుడే

స్పందనకు వందనం



మచిలీపట్నంలోని పరాసుపేట సువర్ణకల్యాణ మండపం ఎదురు సందులో 9/303 విద్యుత్తు స్తంభాన్ని చెట్టుకొమ్మలు ఆవరించాయి. సమస్యను స్థానికులు మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకురాగా వార్త ప్రచురితమైంది. విద్యుత్తు శాఖ సిబ్బంది స్పందించి కొమ్మలు తొలగించారు. సమస్య పరిష్కారం కావడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వెండి శంఖం బహూకరణ



మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే : నగరంలోని బచ్చుపేట వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి అభిషేక కైంకర్యాల నిమిత్తం భక్తులు చిరువోలు దుర్గానాగేశ్వరప్రసాద్, పద్మజారాణి దంపతులు రూ.44 వేల విలువైన వెండి శంఖం బహూకరించారు. సోమవారం ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ముత్తేవి రవికాంత్‌ను కలిసి శంఖాన్ని అందజేశారు.

వైద్య శిబిరానికి స్పందన

వీరంకిలాకు(పమిడిముక్కల), న్యూస్‌టుడే: మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం వీరంకిలాకులో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించింది. మ్యాక్సీ విజన్ కంటి ఆస్పత్రి విజయవాడ వారి సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో 125 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, అవసరమైన వారికి ఉచిత శస్త్రచికిత్సలకు ఏర్పాటు చేస్తున్నట్టు సంఘ కార్యదర్శి బొల్లా వెంకటేశ్వరరావు తెలిపారు. సంఘ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు కె రాజేంద్రప్రసాద్, ఎడ్ల దుర్గారావు, జిల్లా కార్యదర్శి సిహెచ్ ఆశీర్వాదం, సంఘ ప్రతినిధులు బి.యోబు, పి.చంద్రపాల్ పాల్గొన్నారు.

మదర్సా ఫౌండర్‌కు కలాం పురస్కారం


పురస్కారాన్ని అందుకుంటున్న సయ్యద్ అహ్మద్

పెడన, పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: పెడనకు చెందిన మదర్సా వ్యవస్థాపకుడు సయ్యద్ అహ్మద్ ఏపీజే అబ్దుల్ కలాం పురస్కారం అందుకున్నారు. గుంటూరుకు చెందిన ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆదివారం ఏసీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అహ్మద్‌కు ఈ పురస్కారాన్ని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అందజేశారు. స్థానిక జగపతి థియేటర్ రోడ్డులో మదర్సాను ఏర్పాటుచేసిన అహ్మద్ పేద విద్యార్థులకు ఆసరాగా ఉంటూ ఉన్నత విద్యావంతుల్ని చేస్తున్నారు. అహ్మద్‌ను పలువురు ప్రముఖులు అభినందించారు.

వినతుల పరిష్కారానికి చర్యలు

పెదపారుపూడి న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 10 అర్జీలు వచ్చాయని, వాటిలో కొన్నింటిని వెంటనే పరిష్కరించడం జరిగిందని మిగిలిన వాటిని త్వరలో పరిష్కరిస్తామని ఆర్డీవో తెలిపారు. ఆయా శాఖల అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తహసీల్దారు వై.రంగారావు, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఎంపీపీ సురేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

25న ఉపాధ్యాయులకు శిక్షణ

పెడన గ్రామీణం: జిల్లాలో ఈ నెల 25న ప్రత్యేక అవసరాల గల పిల్లల సమాచారానికి సంబంధించి ప్రశస్థ యాప్‌పై ఆన్‌లైన్ శిక్షణ ఉంటుందని జిల్లా ఎస్ఎస్ సహిత విద్య సమన్వయకర్త శ్రీకాకుళపు రాంబాబు సోమవారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఆన్‌లైన్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఐఈఆర్టీలకు ఈ తరగతులు ఉంటాయని ఆయన వివరించారు.

గ్రామంలో చెత్తకుప్పల తొలగింపు


మాట్లంలో రహదారులపై చెత్త తొలగిస్తున్న పొక్లెయిన్

మాట్లం (కృత్తివెన్ను, న్యూస్‌టుడే): మండలంలోని మాట్లం గ్రామంలో సోమవారం నుంచి పంచాయతీ ఆధ్వర్యంలో డ్రైనేజీల తవ్వకం, రహదారులపై చెత్త తొలగింపు పనులు చేపట్టారు. పంచాయతీ సర్పంచి తిరుమాని పాండురంగరావు, పంచాయతీ కార్యదర్శి బస్వాని చిరంజీవి పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. మరో రెండు రోజులపాటు ఈ పనులు జరుగుతాయని సర్పంచి పాండురంగారావు తెలిపారు. కార్యదర్శి చిరంజీవి, పంచాయతీ పాల్గొన్నారు.

ఉద్యోగులకు వీడ్కోలు

పెడన, న్యూస్‌టుడే: బల్లిపర్రు సచివాలయంలో దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి గుంటుపల్లి సాయి హవీల, వీఆర్వో కలిదిండి గణేష్‌లను సర్పంచి జోగి నాగ వరలక్ష్మీ, ఉద్యోగులు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. సాయి హవీల లంకలకలవగుంటకు, వీఆర్వో గణేష్ కప్పలదొడ్డి పంచాయతీకి బదిలీపై వెళ్తున్నారు. వెంకట రమణ, వీఆర్వో కృపా వరప్రసాద్, కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళా సద్వినియోగం చేసుకోండి

పామర్రు, న్యూస్‌టుడే: గుడివాడ ఏఎన్‌ఆర్ కళాశాల పీజీ సెమినార్ హాల్లో మంగళవారం జరిగే జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సూచించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచన మేరకు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నారన్నారు.

ఉన్నత పాఠశాలకు దాతల వితరణ

మొవ్వ(కూచిపూడి),: స్థానిక శ్రీమండవ కనకయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి దాతల ఔదార్యంతో రూ.2.9 లక్షల విలువగల వివిధ పరికరాలు సమకూరినట్టు ప్రధానోపాధ్యాయిని సూర్యదేవర శ్రీదేవి తెలిపారు. యూఎస్ఏకు చెందిన మధుకర్, పూర్వవిద్యార్థులు రూ.1.3 లక్షలతో ఆర్వో ప్లాంటు, మండవ శేషగిరిరావు యూఎస్ఏ రూ.1.2లక్షల విలువైన స్టీమ్డ్ రైస్‌కుక్కర్, రూ.40వేలు విలువైన భోజనం వడ్డించు సామగ్రి పాఠశాలకు అందజేశారన్నారు. వీటిని సోమవారం పాఠశాల పూర్వ విద్యార్థులు డాక్టర్ తాతినేని గోపాలరావు, మండవ బుజ్జి (కోటేశ్వరరావు) నీలవేణిలు ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయ బృందం అభ్యర్థన మేరకు డాక్టర్ తాతినేని గోపాలరావు రూ.50 లక్షలు విలువగల ఆధునిక వంటగది, భోజనశాల నిర్మించేందుకు అంగీకరించినందుకు శ్రీదేవి, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

రహదారుల మరమ్మతులు చేయరూ..!


పోడు-పడతడిక రహదారిలో చోదకుల అవస్థలు

మండలంలోని నిడమర్రు పంచాయతీ పోడు నుంచి పడతడిక వెళ్లే మూడ కిలోమీటర్ల రహదారి అడుగడుగునా గుంతలతో ప్రమాదకరంగా మారింది. ఇప్పటికే ఈ రహదారిలో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగాయని స్థానికులు వాపోతున్నారు. వైకాపా పాలన నిర్లక్ష్యంతో ఈ దుస్థితి తలెత్తిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. చెరువుల్లా ఉన్న ఈ రహదారిలో ఎక్కడ గుంత ఉందో అంతు భయపడిపోతున్నారు. నిత్యం ఈ రహదారిలో వందలాది వాహనాలు, రైతులు వెళ్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రహదారి నిర్మించాలని కోరుతున్నారు.


పోడు-పడతడిక మధ్య ఇలా..

- న్యూస్‌టుడే, పోడు, పడతడిక(కృత్తివెన్ను)


ప్రమాదకరంగా మారిన పోడు-పడతడిక రోడ్డు

పెనమలూరు
• పెనమలూరు • గన్నవరం


పరీక్ష రాస్తున్న విద్యార్థులు


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శాంతిశ్రీ

ప్రతిభ చూపి.. విజేతగా నిలిచి

తాడిగడప(కానూరు), న్యూస్‌టుడే: తాడిగడప జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. షేక్ షరీఫ్ (10), షేక్ హర్షాఫ్ ఉన్నీసా (10), షేక్ నసీరుద్దీన్ (9) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎన్.శాంతిశ్రీ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందనకు వందనం

కానూరు పంట కాలువ రోడ్డులో రవీంద్ర భారతి స్కూల్ పక్కన రోడ్డుపై చెత్త కుప్పలతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు 'మేమున్నాం తోడుగా' దృష్టికి తీసుకువచ్చారు. ఈవిషయాన్ని కమిషనర్ భవానీప్రసాద్ దృష్టికి తీసుకు వెళ్లగా ఆయన స్పందించి సిబ్బందిని పంపి చెత్త తీయించారు. **- న్యూస్‌టుడే, కానూరు**

? బాపులపాడు గ్రామ పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారి ఐటీఐ రోడ్డు దారుణంగా తయారైంది. పలుచోట్ల రహదారి కోసుకుపోయింది. **–రాము, బాపులపాడు**

✔ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. **– జోగేశ్వరరావు, ఎంపీడీవో, - న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్**

? కానూరు ఎన్‌బీఐ కాలనీలో వారం రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. **– కుందేటి శాస్త్రి, కానూరు**

✔ సిబ్బందిని పంపి లైట్లు బాగు చేయిస్తాం.
– పి.భవానీప్రసాద్, కమిషనర్, తాడిగడప పురపాలక సంఘం
- న్యూస్‌టుడే, కానూరు

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు తీగల మరమ్మతుల కారణంగా గన్నవరం సెక్షన్ పరిధిలో పలుచోట్ల సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ రాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పురుషోత్తపట్నం ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా పురుషోత్తపట్నం, కొండపావులూరు, గోపవరపుగూడెం పంచాయతీ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పట్టభద్రుల ఓట్లు నమోదు చేసుకోవాలి

ఉయ్యూరు, న్యూస్‌టుడే : నియోజకవర్గంలో కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసుకునేందుకు నవంబరు 6వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు ఉయ్యూరు ఆర్డీవో బీఎస్ హెలా షారోన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబరు 2024 నాటికి కనీసం మూడేళ్ల ముందు ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, ఫారం-18, ఏదైనా డిగ్రీ ప్రొవిజనల్ అటెస్టెడ్ కాపీ, ఆధార్ నకలు, ఓటరు నివాస ధ్రువపత్రం సమర్పించాలని పేర్కొన్నారు. అర్హులైన వారు ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్ ద్వారా సంబంధింత అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ల కార్యాలయంలో సంబంధిత పత్రాలతో ఓటు నమోదు చేసుకోవాలన్నారు.

జాతీయ రహదారైతే మాకేంటి?

- గూడవల్లి వద్ద ట్రాఫిక్ కష్టాలు
- ప్రమాదం జరిగినా కానరాని ఖాకీలు

న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టిన అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం కలిగించవద్దని పలుమార్లు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మార్గంలో విజయవాడ నుంచి ఏలూరు మీదుగా విశాఖపట్నం వైపునకు 20 వేల వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన హైవేపై సైతం చిన్నపాటి ప్రమాదం జరిగినా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవాల్సిందేనని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


గూడవల్లి వద్ద హైవే పక్కన నిలుపుదల చేసి ఇలా..

విమాన ప్రయాణికులకు ఇక్కట్లు..

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దేశంలోని ప్రధాన నగరాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులను హైవే ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ఇక్కడి నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, దిల్లీకి సర్వీసులు ఉన్నాయి. బోర్డింగ్ సమయానికి గంట ముందు బయలుదేరినా ట్రాఫిక్ కారణంగా నిర్ణీత సమయానికి చేరుకోలేక పలువురు ప్రయాణికులు తిరిగి వెనక్కి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. గూడవల్లి కూడలి పరిసరాల్లో లారీలను హైవే పైనే రివర్స్ చేయడంతో పాటు, రెండు లారీలను పక్కపక్కన నిలుపుదల చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది.

ఎందుకంత నిర్లక్ష్యం..

గన్నవరం నియోజకవర్గ పరిధిలోని చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. విజయవాడ నగర పోలీసు కమిషనరేట్ పరిధిలోని గూడవల్లి, కృష్ణాజిల్లా ఎస్పీ పరిధిలోని గన్నవరం మధ్య ప్రమాదాలు అధికంగా నమోదు కావడం స్థానికులను మరింత భయభ్రాంతులకు గురిచేస్తోంది.

★ గత మూడు నెలల్లో వ్యవధిలో సుమారు ఆరుగురు చనిపోగా, 36 మంది వరకు క్షతగాత్రులయ్యారు. ఇటీవల గన్నవరం ట్రాఫిక్ ఏఎస్సై గూడవల్లి-కేసరపల్లి మధ్య ఆగి ఉన్న లారీని ఢీకొని చికిత్స పొందుతూ మరణించారు. ప్రమాదాలకు గురైన వాహనాలను వెంటనే ఘటనా స్థలిలో నుంచి తొలగించేందుకు ట్రాఫిక్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

★ విజయవాడ రూరల్ మండలం గూడవల్లి వద్ద ఓ కారు, లారీ పరస్పరం ఢీకొన్నాయి. ప్రమాదంలో వాహనాలు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ఈ ఘటనతో రోడ్డుపైనే కారును గంటల తరబడి నిలిపివేశారు. దీంతో హైవేపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.

రోడ్డు దాటాలంటే భయం

నిత్యం గన్నవరం నుంచి జక్కులనెక్కలం రాకపోకలు సాగిస్తుంటా. ఇంటి దగ్గర నుంచి గన్నవరం రాకపోకలకు జాతీయ రహదారి దాటాలంటే భయమేస్తోంది. ఏడాదిగా ఈ ప్రాంతంలో ఎన్నో ప్రమాదాలు చూశా. పట్టించుకొనే నాథుడే కరవయ్యారు.
- ప్రకాశ్, జక్కులనెక్కలం

అరచేతిలోనే ప్రాణాలు

ప్రతి రోజు విజయవాడ, గన్నవరం రాకపోకలు చేస్తుంటా. వృత్తి రీత్యా నిత్యం ఎనికేపాడు నుంచి కేసరపల్లి వరకు వచ్చే క్రమంలో గూడవల్లి వచ్చిందంటే ఏ లారీ సడన్‌గా హైవే మీదకి వస్తుందో అని ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది.
- లంకా గంగాధరరావు, సామాజికవేత్త, సావరగూడెం

రీసర్వే భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న గ్రామసభలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వి.నాగభూషణం తెలిపారు. సోమవారం చిరివాడలో సభ నిర్వహించి అర్జీలు స్వీకరించారు. రీ సర్వే సమయంలో పొరపాట్లపై రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. మంగళవారం బిళ్లనపల్లిలో గ్రామసభ నిర్వహిస్తున్నామన్నారు.

ఉయ్యూరుగ్రామీణం, న్యూస్‌టుడే : మండల పరిధిలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి నవంబరు 4 నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సురేశ్‌కుమార్ తెలిపారు. 4న పెద ఓగిరాల, 5న వీరవల్లిమోఖాసా, 7న సాయిపురం, 8న ఆకునూరు, 11న రామచంద్రాపురం, బొళ్ళపాడు, 12న కడవకొల్లు వద్ద గ్రామసభలు నిర్వహిస్తున్నామని, భూ యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి ఆధార్ సవరణ క్యాంపులు

పెనమలూరు, న్యూస్‌టుడే: పెనమలూరు మండలంలో ఈనెల 22వ తేదీ నుంచి 25 వరకు ఆధార్ కార్డు సవరణ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బండి ప్రణవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 22, 23 తేదీల్లో పెనమలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో, 24, 25 తేదీల్లో వణుకూరు ఎంపీపీ పాఠశాలలో ఈ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. సవరణలు, చిన్నపిల్లలకు ఆధార్ కార్డు నమోదుకు ఈ క్యాంపుల్లో నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కూటమితోనే అభివృద్ధి

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి అధికారంలో ఉంటే అభివృద్ధి పనులు జరుగుతాయని దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలకు తెలుసని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కుమారుడు బోడే వెంకట్రామ్ అన్నారు. సోమవారం మండలంలోని పునాదిపాడు గ్రామంలోని బోడే ప్రసాద్ కాలనీ వద్ద అంతర్గత రహదారికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో మూడు నెల వ్యవధిలోనే తెదేపా అనేక అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. గ్రామంలో రహదారుల నిర్మాణానికి రూ.23 కోట్లను కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా పునాదిపాడులో రూ.26 లక్షల వ్యయంతో వేయనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు నాణ్యత లోపించకుండా వేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర, కాసరనేని కరుణ, సాయిబాబు, శ్రీను, బాబు, ఎం.వెంకటేశ్వరరావు, బాను, సంజీవ్, భవాని, సురేష్, తదితరులు పాల్గొన్నారు.


పునాదిపాడు: అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే కుమారుడు వెంకట్రామ్

ఎస్సై-2గా బాధ్యతల స్వీకరణ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: హనుమాన్‌జంక్షన్ ఎస్సై-2గా ఎన్.లక్ష్మీనరసింహ మూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుడివాడ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పని చేస్తున్న ఆయనను ఇటీవల ఇక్కడకు బదిలీ చేశారు. గతంలో పని చేసిన ఎస్సై-2 అర్జున్ బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లడంతో ఆయనను నియమించారు. స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆయన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం ఆర్టీసీ డిపో పరిధిలో ఏపీపీటీడీ కార్మిక పరిషత్తు నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా జీఎస్.రావు, కార్యదర్శిగా ఏఆర్.శేఖర్, ఉపాధ్యక్షుడిగా ఏఎస్.ప్రసాద్‌లు నియమితులయ్యారు. నూతన కమిటీ ప్రతినిధులను డిపో మేనేజర్ శివాజీ పరిచయం చేసిన కార్మిక పరిషత్తు నాయకులు.. శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో రీజనల్ కమిటీ సభ్యులు శివశంకర్, విజయవాడ డిపో కార్యదర్శి ఎస్.ప్రభాకరరావు, టీఎన్‌టీయూసీ ప్రతినిధి నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న శునకాలు

పోరంకి, న్యూస్‌టుడే



పోరంకిలో గ్రామ సింహాల బెడద ఎక్కువైంది. వాటి అరుపులతో రాత్రులు నిద్ర పట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు. వీధుల వెంట, రహదారులపై గుంపులు గుంపులుగా చేరి వాహనదారుల వెంట పడడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

★ ఈనెల 20న బృందావనం కాలనీలో ఇంటి నుంచి బయటకు వచ్చి వీధిలో ఆడుకుంటున్న బాలుడిని కుక్కలు నోటితో చొక్కా పట్టి లాగి కింద పడ వేసి చుట్టుముట్టడంతో దానిని గమనించిన అపార్టుమెంట్ల వాచ్‌మెన్‌లు బయటకు వచ్చి చిన్నారిని కాపాడారు. దీంతో తల్లిదండ్రులు, నివాసితులు ఊపిరి పీల్చుకున్నారు. వాటి బెడదతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. జీవాలు, పశు, గేదెలు వాటి బారిన పడి తీవ్రంగా నష్టపోవలసి వస్తోందని యజమానులు వాపోతున్నారు. ఫిర్యాదు చేసినా పురపాలిక అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు తెలిపారు.

★ ఇటీవల వరదలు ఊళ్లను ముంచెత్తడంతో మూగజీవాలైన శునకాలు కృష్ణానది కరకట్ట నదీ గర్భంలోని ఆవాసాలను వదిలి మైదాన ప్రాంతాలకు వలస రావడంతో పోరంకిలో శునకాల గుంపులు సంఖ్య పెరిగిందని నివాసితులు పేర్కొంటున్నారు. వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్, పశుసంవర్ధక శాఖాధికారులు కలుగజేసుకొని వాటిని నియంత్రించ వలసిందిగా ప్రజలు కోరుతున్నారు.

గ్రామం : పోరంకి
జనాభా : 50,000పైనే
కాలనీలు : 14
వీధి కుక్కలు : 300
పెంపుడు శునకాలు : 150
కుక్కకాటుకు గురైన వారు : 25 మంది
ప్రమాదాల సంఖ్య : 10

భక్తి, శ్రద్ధలతో పూజలు

యనమలకుదురు (పెనమలూరు), న్యూస్‌టుడే: స్థానిక శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక, ధార్మిక శోభ వెల్లివిరిసింది. సోమవారం వేకువజాము నుంచే ఆలయంలో భక్తుల రాక ఆరంభం కాగా ఉదయం 6.30 గంటల నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. రుద్రాభిషేకం, ఏకాదశరుద్రాభిషేకాలు నిర్వహించారు. స్వామివార్లకు నిర్వహించిన ప్రత్యేక పుష్పాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. వేద పండితులు రాత్రి పంచహారతులు, పల్లకీసేవలను నిర్వహించగా.. అనంతరం భక్తులు భజన కీర్తనలను ఆలపించారు. కార్యక్రమాల్లో దాత సంగా నరసింహారావు, కార్యనిర్వహణాధికారి ఎన్.భవానీ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


పుష్పాలంకరణలో శ్రీరామలింగేశ్వరస్వామి

ఖాళీ స్థలాలా? చిట్టడవులా

రామవరప్పాడు, ప్రసాదంపాడు, నిడమానూరు, న్యూస్‌టుడే

పిచ్చి మొక్కలు, చెత్త చెదారంతో ఇలా..


ప్రసాదంపాడులోని అయోధ్య శ్రీనివాస వీధిలో..


రామవరప్పాడులోని సిండికేట్ బ్యాంకు కాలనీలోని ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలు

విజయవాడ రూరల్ మండలంలోని రామవరప్పాడు, ప్రసాదంపాడు, నిడమానూరు గ్రామాల్లో ఖాళీ స్థలాల నిర్వహణను యజమానులు వదిలేశారు. కొన్నేళ్ల కిందట ఈ గ్రామాల్లో భూమి తక్కువ ధర ఉండడంతో చాలా మంది భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాంతాల్లో స్థలాలు కొనుగోలు చేశారు. కొనుగోలు చేసి ఏళ్ల తరబడి ఈ స్థలాలను అలాగే వదిలేయడంతో వీటిలో చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి చుట్టుపక్కల నివసించే ప్రజలకు తీవ్ర అసౌకర్యం మారింది. పంచాయతీ అధికారులు సైతం శ్రద్ధ పెట్టకపోవడంతో వీటిల్లో పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు పెరిగి అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. కొన్ని స్థలాలు రోడ్డు కంటే పల్లంలో ఉండడంతో వర్షపు నీరు వెళ్లే మార్గం లేక చెరువుల్లా మారి దోమలకు ఆవాస కేంద్రాలయ్యాయి. దీంతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విష జ్వరాలు ప్రబలుతున్నాయని భయాందోళనకు గురవుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం...

గ్రామ పరిధిలోని ఖాళీ స్థలాలు గుర్తించి వాటిని శుభ్రం చేసేందుకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి. స్థలం యాజమానులకు నోటీసులు ఇచ్చి, ఇచ్చిన గడువు లోపు స్పందించకపోతే పంచాయతీ అధికారులే ఆ స్థలంలో అపరిశుభ్రతను తొలగించాలి. అందుకు అయిన ఖర్చు సదరు యాజమాని నుంచి వసూలు చేయాలి. కానీ అధికారులు ఖాళీ స్థలాలు గుర్తించి, నోటీసులు జారీ చేయడంలో అలసత్వం వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీ స్థలాలు శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.


పుచ్చలలంకలో చిక్కుకున్న పశుపోషకులను నావలో ఒడ్డుకు తీసుకొస్తున్న మత్స్యకారులు


కాసరనేనివారిపాలెం శివాలయం చుట్టూ చేరిన వరద నీరు

మరింత పెరిగిన వరద

మద్దూరు/కాసరనేనివారిపాలెం (కంకిపాడు), న్యూస్‌టుడే : కృష్ణా నదికి వరద ఉద్ధృతి సోమవారం సాయంత్రానికి మరింత పెరిగింది. ప్రకాశం బ్యారేజ్ నుంచి 2.28 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేయడంతో నదీ పరివాహక గ్రామాల్లో ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. పుచ్చలలంకలో చిక్కుకున్న పశు పోషకులను స్థానిక మత్స్యకారులు నావల్లో ఒడ్డుకు చేర్చారు. చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరించడంతో నావలకు లంగరు వేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె ఉద్ధృతం

యనమలకుదురు(పెనమలూరు), న్యూస్‌టుడే: తాడిగడప పురపాలికలోని చెత్త తరలింపు వ్యాన్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించకపోతే సమ్మె ఉద్ధృతం చేస్తామని సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు పేర్కొన్నారు. మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదంటూ వ్యాన్ డ్రైవర్లు ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తుండగా సోమవారం యనమలకుదురు లాకుల కూడలిలో అర్ధనగ్న ప్రదర్శనతో అధికారులకు తమ నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మంత్రి నారాయణతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా అమలులోకి రాలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ మస్తాన్‌వలీ, సురేష్, నాగరాజు, సురేష్, చిన్నా, భోజ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గాలింపు చర్యలు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : తోట్లవల్లూరు కృష్ణా నది పాయలో గల్లంతైన జగన్నాథమూర్తి ఆచూకీ కోసం మూడు రోజుల నుంచి పడవలపై తీవ్రంగా గాలిస్తున్నా ఫలితం కన్పించలేదు. సోమవారం సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదని ఎస్సై అర్జునరాజు తెలిపారు. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది పడవలు, ఫైబర్ బోట్లు వేసుకుని తోట్లవల్లూరు, శ్రీకాకుళం, పులిగడ్డవారధి వరకు గాలించారని తెలిపారు. వరద ఉద్ధృతి విపరీతంగా పెరగడంతో జగన్నాథం మూర్తి(35) ఒరవడికి కొట్టుకుపోయారా? ఎక్కడైనా చెట్టుకు చిక్కి ఉంటారా? అనే సందేహం వ్యక్తం చేశారు. దొరికే వరకు గాలింపు చర్యలు చేపడతామని ఎస్సై ఈసందర్భంగా తెలిపారు.

దేవాలయాలకు దాతలే దిక్కు

- ఉత్సవాల నిర్వహణ భారం
- ఖర్చు రూ.లక్షల్లో.. కేటాయింపు రూ.వేలల్లో

కంకిపాడు, న్యూస్‌టుడే



దేవాదాయశాఖ అధీనంలోని దేవాలయాల వైభవం మసకబారుతోంది. పెత్తనం మినహా ఉత్సవాలకు ఇచ్చే సాయం అంతంత మాత్రంగా ఉంటోంది. ఇక కమిటీ బాధ్యులు, నిర్వాహకులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలో పురాతన దేవాలయాల్లో ఒకటైన కంకిపాడులోని గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి (శివాలయం)లో దసరా ఉత్సవాలు వైభవోపేతంగా జరపడం ఆనవాయతీగా వస్తోంది. ధూపదీప నైవేద్యాలు, అన్నదానం తదితర ధార్మిక కార్యక్రమాలు చేపడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రంగులు వెలసి వెలవెలబోతోంది. ఇదే పరిస్థితి మండలంలోని అన్ని ప్రభుత్వాధీనంలోని దేవాలయాల్లో నెలకొంది.

కమిటీలతో సరి

గత కొన్నేళ్లుగా మండలంలోని దేవాలయాలకు పూర్తి స్థాయి (రెగ్యులర్) ట్రస్ట్ కమిటీలను ఏర్పాటు చేయలేదు. పండగ సందర్భాల్లో మాత్రం తాత్కాలిక ప్రాతిపదికన ఉత్సవ కమిటీలను నియమిస్తున్నారు. గతంలో కమిటీలో ప్రతినిధిత్వానికి పోటీ పడేవారు. ప్రస్తుతం ఒత్తిడిపై బాధ్యతలు తీసుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు.

దేవాదాయశాఖ సాయం రూ.30 వేలకు మించి ఉండడం లేదు. భక్తుల నుంచి విరాళాలు గతంలో ఖర్చులకు తగ్గట్టు వచ్చేవి. ప్రస్తుత పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. ఇక ఉత్సవ కమిటీ ప్రతినిధులపై అదనపు భారం రూ.50 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు పడుతోంది. ఈ పరిస్థితిలో ఉత్సవాల నిర్వహణ తలకు మించిన భారంగా భావిస్తున్నారు..

ఇటీవల శరన్నవరాత్రులకు అయిన ఖర్చు ఇలా..

కార్యక్రమం	వ్యయం (రూ.వేలల్లో)
అలంకరణకు	30-40
ప్రసాదం, అన్నదానం, పూజా సామగ్రి	20
అర్చకునికి	20-30
గ్రామోత్సవం	30-50
విద్యుత్తు దీపాలు, ఇతర అలంకరణ	70

ఆదాయం ఏమైపోతోంది

మండలంలోని ప్రధాన దేవాలయాలకు సరాసరిన 10 ఎకరాల సారవంతమైన వ్యవసాయ భూమి ఉంది. తద్వారా రూ.3 లక్షల కౌలు ద్వారా ఆదాయం వస్తోంది. ఇక హుండీ ఆదాయం అదనం. మరి ఈ సొమ్మంతా ఏమవుతుందంటే.. సమాధానం చెప్పేవారు కరువవుతున్నారు.

అభివృద్ధికి నిధులు నిల్

దేవాలయాల అభివృద్ధికి ఆశాఖ గత నాలుగేళ్లుగా నిధులు కేటాయించలేదు. కంకిపాడులోని విష్ణ్వాలయం, శివాలయంలో ధ్వజస్తాంభాల ప్రతిష్ఠాపన, చెన్నకేశవ స్వామి ఆలయంలో మండప, పునరుద్ధరణకు ఖర్చంతా దాతలే భరించారు.

గ్రామం	దేవాలయం పేరు	వ్యవసాయభూమి (ఎకరాల్లో)
గొడవర్రు	వేణుగోపాలస్వామి సోమేశ్వరస్వామి	13.80 12.73
కంకిపాడు	విష్ణ్వాలయం శివాలయం	08.35 06.45
ఉప్పలూరు	భోగమల్లేశ్వరస్వామి వేణుగోపాల స్వామి ఉత్సవాల నిర్వహణకు	17.87 18.05 12.77
నెప్పల్లి	శివాలయం	14.68
మంతెన	చెన్నకేశవ స్వామి మల్లికార్జునస్వామి	10.00 14.00
కోలవెన్ను	చెన్నకేశవస్వామి	15.00
ఈడుపుగల్లు	కామేశ్వరస్వామి	14.61
వేల్పూరు	చంద్రశేఖరస్వామి సీతారామాంజనేయస్వామి	12.89 05.00


విద్యార్థినికి జ్ఞాపిక అందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

క్రీడా పోటీల్లో ప్రతిభ

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం బాలికలు, బాలుర జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14లో హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు మానికొండ సాయిసత్య చిన్మయి, అండర్-17 సైక్లింగ్‌లో జి.లోచన ఎంపికైనట్లు హెచ్‌ఎం దుగ్గిరాల ఝాన్సీరాణి తెలిపారు. నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో కృష్ణాజిల్లా తరపున లావణ్య, జి.వినూత్న, కె.పల్లవి, పి.జోస్మిత ఉత్తమ ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు.

పాఠశాల సహకారం మరువలేనిది

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: దాతల సహకారం మరువలేనిదని తెదేపా రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. విజయవాడలోని పడమట పరిధి నిర్మలా కాన్వెంట్ సహకారంతో సోమవారం మండలంలోని వల్లూరుపాలెంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, ఎంపీయూపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు.

గుడివాడ

●గుడివాడ ●పామర్రు ● అవనిగడ్డ

ఉత్సాహంగా ప్రతిభాపాటవ పోటీలు

'ఈనాడు' ఆధ్వర్యంలో గుడివాడ జగన్నాథపురం త్రివేణి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో సోమవారం నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని సృజన చాటారు. 'అంతర్జాల వినియోగం, లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలుగా నిలిచిన పి.వేదశ్రీ(పదో తరగతి), బి.స్నేహజ(9), ఎన్.దివిశ్రీ (9))లకు పాఠశాల డైరెక్టర్ ఎన్.శివశంకర్ బహుమతులు అందజేసి అభినందించారు.

- న్యూస్‌టుడే, గుడివాడ గ్రామీణం



విజేతలతో త్రివేణి పాఠశాల డైరెక్టర్ శివశంకర్



వ్యాసరచన పోటీల్లో చిన్నారులు

పల్లె పండగ పనులు సంక్రాంతికి పూర్తి

బొడ్డపాడు(తోట్లవల్లూరు), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పల్లె పండగ పేరుతో గ్రామాల్లో అభివృద్ధి వెలుగులు నింపడమే ధ్యేయంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మండలంలోని బొడ్డపాడులో ఉపాధి హామీ నిధులు రూ.40 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు సోమవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ పనులన్నీ సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని కృతనిశ్చయంతో ఉన్నామని తెలిపారు. సర్పంచి మూడే శివశంకర్, జనసేన నాయకుడు దాటిశెట్టి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



బొడ్డపాడు: కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్‌రాజా తదితరులు

నేటి ఉద్యోగమేళా సద్వినియోగం చేసుకోండి

పామర్రు, న్యూస్‌టుడే: గుడివాడ ఏఎన్ఆర్ కళాశాల పీజీ సెమినార్ హాల్లో మంగళవారం జరిగే జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సూచించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచన మేరకు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నారన్నారు.

ఏళ్లుగా నిర్లక్ష్యం.. వంతెనలు శిథిలం

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే

భయం భయంగా వాహనచోదకుల ప్రయాణం

మండలంలో పలుచోట్ల కాల్వలపై నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరాయి. ప్రమాదమని తెలిసినా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలు చేయాల్సి వస్తోందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. దశాబ్ద కాలంగా కనీస మరమ్మతులకు నోచుకోకపోవడం, ఇటీవల వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు వారధులు ఎప్పుడు కూలుతాయోనని ప్రజలు భయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం వీటిపై తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



అవనిగడ్డలో విరిగిపోయిన రెయిలింగ్స్



తూర్పు కాల్వపై మోదుమూడి వద్ద..

ఇదీ పరిస్థితి

★ పులిగడ్డలోని దివి ప్రధాన పంట కాల్వపై 90వ దశకంలో నిర్మించిన ఫెర్రీ వంతెన పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. రెయిలింగ్స్ విరిగిపోయాయి. ★ అవనిగడ్డలో నిర్మించిన వంతెన పిల్లర్లపై మొక్కలు మొలిచి వృక్షాలుగా మారుతున్నా పట్టించుకునే వారు లేరు. 60వ దశకంలో నిర్మించిన ఈ వంతెన అవనిగడ్డకు ప్రధాన మార్గంగా ఉంది. మరో రెండు వంతెనలు ఇటీవల నిర్మించారు. ఒకదానికి అనుసంధాన రహదారి పూర్తి స్థాయిలో నిర్మాణానికి నోచుకోలేదు. ★ మోదుమూడి ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉన్న వారధి రెయిలింగ్ విరిగిపోయింది. అడుగు భాగంలో సిమెంటు పెచ్చులు ఊడిపోయాయి. ★ అవనిగడ్డ- నాగాయలంక రహదారిపై గుడివాకవారిపాలెం వద్ద దక్షిణ కాల్వపై ఉన్న వంతెన దెబ్బతింది. రైతులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు వీలుగా దివంగత మంత్రి సింహాద్రి సత్యనారాయణరావు హయాంలో వంతెన నిర్మించారు. ఇప్పటికీ దీనికి అనుసంధాన రోడ్డు నిర్మించలేదు.

ఓటు నమోదు చేసుకోవాలి

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: 2021 వరకు డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎం.కుసుమ కుమారి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా 44 మంది ఓటు నమోదు చేసుకున్నారని తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు మొత్తం 260 మంది సభ్యులు ఓటు నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. గతంలో ఉన్న పట్టభద్రుల ఓట్లు మొత్తం రద్దు అయ్యాయని, ఈసారి తప్పని సరిగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. నవంబరు 6వ తేదీ సాయంత్రంతో గడువు ముగియనున్నదని, అప్పటి వరకు ఉండకుండా ముందస్తుగానే ఆన్‌లైన్, ఆఫ్ లైన్‌లో ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

విద్యా సంస్థల అధినేతకు పురస్కారం

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రుకు చెందిన ఏఎన్ఎం ఆంగ్ల మాధ్యమ విద్యా సంస్థల అధినేత ఎ.పూర్ణచంద్రారెడ్డికి జాతీయ ప్రతిభా పురస్కారం లభించింది. ఈనెల 20న ఎస్‌పీఎల్‌టీవో వారి ఆధ్వర్యంలో గుంటూరు ఏసీ కళాశాల అసెంబ్లీ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అతిథుల చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నట్టు పూర్ణ చంద్రారెడ్డి తెలిపారు.

హుండీల ఆదాయం లెక్కింపు

మంటాడ(పమిడిముక్కల): స్థానిక శ్రీవైకుంఠ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను ఈనెల 24న తెరచి లెక్కిస్తారని ఆసక్తిగల భక్తులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొనవచ్చని కార్యనిర్వహణాధికారి మాధవి తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఘంటసాల: మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ వేమూరి రజనీకుమారి అధ్యక్షతన మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుబ్బారావు పేర్కొన్నారు. పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని తెలిపారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

ఘంటసాల, న్యూస్‌టుడే: ఘంటసాలలోని యూవీఆర్ గొర్రెపాటి స్కూల్‌ను సోమవారం మచిలీపట్నం డీవైఈవో బి.శేఖర్ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మౌలిక వసతుల కల్పనను పరిశీలించారు. ఎంఈవో 2 ఎం.డి.మోమిన్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, ప్రిన్సిపల్ లోయ నాగేశ్వరరావు, గొర్రెపాటి ఫౌండేషన్ ప్రతినిధి కొండపల్లి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాలలో సీపీఎం మహాసభ

ఘంటసాల, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. సోమవారం ఘంటసాలలో సీపీఎం మండల 8వ మహాసభను నిర్వహించారు. సీపీఎం జెండాను మండల పార్టీ సీనియర్ నాయకుడు కంచర్ల నాగరాజు ఆవిష్కరించారు. అనంతరం సీపీఎం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల సీపీఎం అధ్యక్షుడిగా మేడంకి వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులుగా బలే రమేష్, కంచర్ల నాగరాజు, వెనిగళ్ల నాగమణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దివిసీమకు చేరుకున్న వరద

పులిగడ్డ(అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో గత వారం రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వానలకు విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు నీటిని విడుదల చేశారు. సోమవారం సాయంత్రానికి దివిసీమ ముఖద్వారమైన పులిగడ్డలోని అక్విడెక్టు వద్ద 2.30 లక్షల క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం కడలివైపు ప్రవహిస్తోంది. రెండు రోజులు పాటు వరదనీటి ప్రవాహం ఉంటుందని జలవనరులశాఖ పులిగడ్డ సబ్‌డివిజన్ ఏఈ పి.వెంకటేశ్వరరావు తెలిపారు. వరద నీటిలో నాటు పడవలపై ప్రయాణాలు చేయవద్దని, లంక భూముల్లో పశువులను మేతకు తీసుకు వెళ్లొద్దని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని ఏఈ తెలిపారు.



పులిగడ్డ అక్విడెక్టు వద్దకు చేరిన వరదనీరు

ఎమ్మెల్యే ఆదేశాలతో పూడిక తొలగింపు

పెదపారుపూడి న్యూస్‌టుడే: మండలంలోని వానపాములలో అధ్వాన డ్రెయినేజీపై అధికారులు స్పందించారు. తమ గ్రామంలో కాలువలు పూడికతో నిండి మురుగు నీటి పారుదలకు అవరోధంగా ఉందని గ్రామస్థులు ఈ నెల 17వ తేదీన పల్లె పండుగకు వచ్చిన ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాకు తెలిపారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే.. ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేయడంతో ఈవోపీఆర్డీ వంశీ ఆధ్వర్యంలో పంచాయితీ అధికారులు పొక్లెయిన్ ఏర్పాటు చేసి కాలువల్లో పూడిక తొలగించారు. ఎమ్మెల్యే కుమార్‌రాజాకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్ల పనులు వెంటనే చేపట్టాలని గ్రామస్థులు కోరారు.



పొక్లెయిన్‌తో పనుల నిర్వహణ

ఇది జగనన్న లేఔటేనండీ!



తుంగలవారిపాలెం వెళ్లే రహదారి పక్కన ఎత్తు పల్లాలు, ముళ్ల పొదలతో

మండలం తుంగలవారిపాలెం వెళ్లే రహదారిలో పొలాలు, ముళ్ల కంపలతో కనిపిస్తున్న ఈ ప్రాంతంలో గత వైకాపా ప్రభుత్వం జగనన్న లేఅవుట్ ఏర్పాటు చేసింది. మండలంలోని వేకనూరుకు చెందిన 73 మందికి, తుంగలవారిపాలెంలో 12 మంది లబ్ధిదారులకు ఇక్కడ నివేశన స్థలాలు ఇచ్చి గృహాలు మంజూరు చేసింది. కానీ మౌలిక వసతులు కల్పించడానికి వచ్చేసరికి మాత్రం అధికారులు, ప్రజాప్రతినిధులు ముఖం చాటేశారు. స్థలాలు మెరక చేయకపోవడంతో ఇళ్లు కట్టుకోవడానికి లబ్ధిదారులు వెనకడుగు వేశారు. కనీసం ఒక్క గృహం కూడా అక్కడ నిర్మించలేదు. కూటమి ప్రభుత్వమైనా ఈ లేఔట్‌ను అభివృద్ధి చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. - అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే

టిడ్కో ఛైర్మన్‌ను సత్కరించిన బుద్ధప్రసాద్



అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: టిడ్కో ఛైర్మన్‌గా నియమితులైన అజయ్ కుమార్‌ను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

25న ఉపాధ్యాయులకు శిక్షణ

పెడన గ్రామీణం: జిల్లాలో ఈ నెల 25న ప్రత్యేక అవసరాల గల పిల్లల సమాచారానికి సంబంధించి ప్రశస్త యాప్‌పై ఆన్‌లైన్ శిక్షణ ఉంటుందని జిల్లా ఎస్ఎస్ఏ సహిత విద్య సమన్వయకర్త శ్రీకాకుళపు రాంబాబు సోమవారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఆన్‌లైన్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఐఈఆర్టీలు ఈ తరగతులు ఉంటాయని ఆయన వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు: 80085 74684 అవనిగడ్డ: 80085 74679

? గుల్లలమోద గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు ఇళ్లలోకి, రోడ్లపైకి చేరి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.

-గ్రామస్థులు

✔ డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

- వి.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, గుల్లలమోద

- న్యూస్‌టుడే, నాగాయలంక

'గత ఐదేళ్లుగా పురపాలికలో భారీ అవినీతి'

గుడివాడ (గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడ పురపాలక సంఘంలో గత ఐదేళ్లలో వైకాపా నేతలు అడ్డుపెట్టుకుని భారీగా అవినీతికి పాల్పడి రూ.కోట్లు దోచుకున్నారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆరోపించారు. దీనివల్ల పారిశుద్ధ్య సమస్య పెరిగిందన్నారు. సోమవారం స్థానిక పురపాలక కార్యాలయంలో అధికారులతో ఆయన పారిశుద్ధ్యం, తాగునీరు, రెవెన్యూ, ప్రజారోగ్యం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుద్ధ్యంపై ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులకు కుంటిసాకులు చెప్పకుండా సమస్య పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. గత ఐదేళ్లుగా పురపాలన అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోయిందని దానిని గాడిలో పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. రానున్న వేసవి నాటికి పట్టణంలో ఎలాంటి ట్యాంకర్లు అవసరం లేకుండా స్వచ్ఛమైన తాగునీరు ప్రతి ఇంటికి అందించేందుకు అధికారులు కలిసి పనిచేయాలన్నారు. గుడివాడ పురపాలక సంఘంలో ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించి ప్రజలు, అధికారుల భాగస్వామ్యంతో నూతన గుడివాడకు నాంది పలకాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపు నిచ్చారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, గుడివాడ జనసేన బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, పురపాలక కమిషనర్ బి.శ్రీనివాసరావు, సహాయ కమిషనర్ పి.శ్రీనివాసరావు, ప్రజారోగ్య శాఖ డీఈ పాండురంగారావు పురపాలక సంఘ అన్ని విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

తాగునీరు, రోడ్ల సమస్యలకు ప్రాధాన్యం

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడ నియోజకవర్గంలో తాగునీరు, రహదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. సోమవారం స్థానిక రాజేంద్ర నగర్‌లోని ఎమ్మెల్యే నివాసానికి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి రాముకు పలు అర్జీలు సమర్పించారు. గుడ్లవల్లేరు మండలం నక్కవానిపాలెం, చింతలకుంట గ్రామాల రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. తక్షణమే స్పందించాలని పంచాయతీరాజ్ అధికారులు వాటి నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని రాము ఆదేశించారు. గుడివాడ మండలం లింగవరంలో నివాసాలు లేనిచోట అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టారని, ప్రజలకు అవసరమైన చోట నిర్మించాలని కూటమి నేతలు కోరారు.

పది అర్జీల స్వీకరణ


పెదపారుపూడి న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 10 అర్జీలు వచ్చాయని, వాటిలో కొన్నింటిని వెంటనే పరిష్కరించడం జరిగిందని మిగిలిన వాటిని త్వరలో పరిష్కరిస్తామని ఆర్డీవో తెలిపారు. తహసీల్దారు వై.రంగారావు, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఎంపీపీ సురేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెదేపా జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్వరావు అన్నారు. అవనిగడ్డ తహసీల్దారు కార్యాలయం వద్ద కూటమి నేతల నేతృత్వంలో చేపట్టిన పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డ: పట్టభద్రునికి దరఖాసు అందజేస్తూ..



చల్లపల్లి: నమోదు పత్రాలు అందజేస్తున్న తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు శివ

చల్లపల్లి, న్యూస్‌టుడే: పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ అన్నారు. సోమవారం చల్లపల్లి మండలంలోని యార్లగడ్డ, పురిటిగడ్డ, పాగోలు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులకు ఫారం 18ను అందచేశారు. మంగళవారం ఏటీఎం సెంటర్‌లో ఓటరు నమోదు శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు రాజులపాటి అంకమ్మ, పైడిపాముల స్వప్న, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ముంపు సమస్య పరిష్కారానికి కృషి

నాగాయలంక, న్యూస్‌టుడే: వరి పొలాల ముంపు సమస్యను పరిష్కరించడానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కృషి చేస్తున్నట్లు మండలి వెంకట్రామ్ తెలిపారు. సోమవారం మండలంలోని భావదేవరపల్లి, కమ్మనమోలు, పర్రచివర, గుల్లలమోదలో ముంపునకు గురైన వరి పొలాలు ఇరిగేషన్ ఏఈ పొన్నూరు రవితేజ, ఆర్‌సీఏఈ పులిగడ్డ వెంకటేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. భావదేవరపల్లి డ్రైనేజీ ముంపు మళ్లించేందుకు సెంట్రల్ ఛానల్ మరోక యూటీ నిర్మించాలని అంతేకాకుండా రత్నకోడ్‌లో కలిసే ఈ డ్రైనేజీ పూడిక తీయించాలని, గ్రామంలో గుండం డ్రైనేజీపై వంతెన నిర్మించాలని రైతులు ఆయన్ను కోరారు. సమస్యల పరిష్కారంపై అధికారులతో చర్చించారు. గతంలో సీఎస్ఆర్ నిధులతో ప్రతిపాదించిన పంప్‌హౌస్ నిధులు రాలేదని రైతులు ఆయనకు తెలిపారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. మండల తెదేపా అధ్యక్షులు మెండు లక్ష్మణరావు, భావదేవరపల్లి సర్పంచి మండలి ఉదయభాస్కర్, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న వరి పైరును వెంకట్రామ్‌కు చూపిస్తున్న రైతులు

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని జమీగొల్వేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయిని టి.ఉషారాణి సోమవారం తెలిపారు. ఈనెల 20న గుడివాడ ఎస్‌పీఎస్ మున్సిపల్ హైస్కూల్లో జరిగిన జిల్లా స్థాయి ఎంపికల్లో బాలికల విభాగంలో కె.ఊర్వ, కె.ధనలక్ష్మి సీహెచ్ శరణ్య, కె.రేష్మశ్రీ, బాలుర విభాగంలో కె.శ్రీనివాసరావులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 25 నుంచి 27 వరకు చిత్తూరు జిల్లాలో కాణిపాకంలో జరిగే 43వ జూనియర్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్నట్లు ఆమె వెల్లడించారు. క్రీడాకారులను, వారికి తర్ఫీదు ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు ఎన్.రవిబాబులను సిబ్బందితో కలిసి అభినందించారు.

కొనసాగుతున్న గాలింపు చర్యలు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు కృష్ణా నది పాయలో గల్లంతైన జగన్నాథమూర్తి ఆచూకీ కోసం మూడు రోజుల నుంచి పడవలపై తీవ్రంగా గాలిస్తున్నా ఫలితం కన్పించలేదు. సోమవారం సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదని ఎస్సై అర్జునరాజు తెలిపారు. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది పడవలు, ఫైబర్ బోట్లు వేసుకుని తోట్లవల్లూరు, శ్రీకాకుళం, పులిగడ్డవారధి వరకు గాలించారని తెలిపారు. వరద ఉధృతి విపరీతంగా పెరగడంతో జగన్నాథం మూర్తి(35) ఒరవడికి కొట్టుకుపోయారా? ఎక్కడైనా చెట్టుకు చిక్కి ఉంటారా? అనే సందేహం వ్యక్తం చేశారు. దొరికే వరకు గాలింపు చర్యలు చేపడతామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

గుడివాడ గ్రామీణం: మండలంలో సోమవారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో నందివాడ మండలం పెదలింగాలకు చెందిన గంటా దేవదానం కాలు విరిగిపోయింది. ద్విచక్ర వాహనంపై సాయంత్రం గుడ్లవల్లేరు వెళుతుండగా.. వెనుక నుంచి చింతలగూడెంకు చెందిన వారా రామారావు తన నూతన ద్విచక్ర వాహనంపై గుడ్లవల్లేరు వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో హరియాలీ మార్కెట్ వద్ద పెట్రోలు బంకులోకి వెళ్లేందుకు యత్నించిన దేవదానంను.. రామారావు వాహనం ఢీకొంది. దేవదానంకు తొడ వద్ద, చీల మండ వద్ద కాలు విరిగింది. రామారావు స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూరిల్లు దగ్ధం

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి నారాయణరావునగర్‌లో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. దివ్యాంగుడైన సోమన వెంకన్నకు చెందిన పూరిల్లు షాట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో బాధితుడు సర్వస్వం కోల్పోయాడు. అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

పాఠశాలకు దాతల వితరణ

మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే: స్థానిక శ్రీమండవ కనకయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి దాతల ఔదార్యంతో రూ.2.9 లక్షల విలువగల వివిధ పరికరాలు సమకూరినట్టు ప్రధానోపాధ్యాయిని సూర్యదేవర శ్రీదేవి తెలిపారు. యూఎస్ఏకు చెందిన మధుకర్, పూర్వవిద్యార్థులు రూ.1.3 లక్షలతో ఆర్‌వో ప్లాంటు, మండవ శేషగిరిరావు యూఎస్ఏ రూ.1.2లక్షల విలువైన స్టీమ్డ్ రైస్‌కుక్కర్, రూ.40వేలు విలువైన భోజనం వడ్డించు సామగ్రి పాఠశాలకు అందజేశారన్నారు. వీటిని సోమవారం పాఠశాల పూర్వ విద్యార్థులు డాక్టర్ తాతినేని గోపాలరావు, మండవ బుజ్జి (కోటేశ్వరరావు) నీలవేణిలు ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయ బృందం అభ్యర్థన మేరకు డాక్టర్ తాతినేని గోపాలరావు రూ.50 లక్షలు విలువగల ఆధునిక వంటగది, భోజనశాల నిర్మించేందుకు అంగీకరించినందుకు శ్రీదేవి, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాల సహకారం మరువలేనిది

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: దాతల సహకారం మరువలేనిదని తెదేపా రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. విజయవాడలోని పడమట పరిధి నిర్మలా కాన్వెంట్ సహకారంతో సోమవారం మండలంలోని వల్లూరుపాలెంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, ఎంపీయూపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. తెదేపా నాయకుడు ఆచంట కోటిబాబు, దాతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సామగ్రిని ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు



పుస్తకాలు పంపిణీ చేస్తున్న వెంకటేశ్వరరావు, దాతలు

వైద్య శిబిరానికి స్పందన

వీరంకిలాకు(పమిడిముక్కల), న్యూస్‌టుడే: మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం వీరంకిలాకులో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించింది. మ్యాక్సీ విజన్ కంటి ఆస్పత్రి విజయవాడ వారి సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో 125 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, అవసరమైన వారికి ఉచిత శస్త్రచికిత్సలకు ఏర్పాటు చేస్తున్నట్టు సంఘ కార్యదర్శి బొల్లా వెంకటేశ్వరరావు తెలిపారు. సంఘ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు కె రాజేంద్రప్రసాద్, ఎడ్ల దుర్గారావు, జిల్లా కార్యదర్శి సిహెచ్ ఆశీర్వాదం, సంఘ ప్రతినిధులు బి.యోబు, పి.చంద్రపాల్ పాల్గొన్నారు.



కంటి పరీక్ష చేస్తున్న వైద్య నిపుణుడు నాగేశ్వరరావు

వచ్చే ఏడాది నుంచి 'పది'లో అంతర్గత మార్కులు

ఈనాడు, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం నుంచి పదో తరగతిలోనూ అంతర్గత మార్కుల విధానాన్ని ప్రవేశపెట్టాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. సిలబస్ మార్పు చేసినందున పరీక్ష విధానంలోనూ మార్పులు తీసుకువచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటులోని అన్ని పాఠశాలలకూ జాతీయ విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) సిలబస్‌నే అమలు చేస్తున్నారు. విద్యార్థులు ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ చదువుతూనే రాష్ట్ర బోర్డు పరీక్షలు రాస్తున్నారు. అయితే సీబీఎస్‌ఈ విధానంలో అంతర్గత మార్కుల విధానం ఉంది. గతంలో నిరంతర, సమగ్ర మూల్యాంకనం (సీసీఈ) విధానంలో అంతర్గత మార్కులు ఉండగా.. 2019లో వీటిని రద్దు చేశారు. అంతర్గత మార్కుల విషయంలో ప్రభుత్వ బడులు నిబంధనలు పాటిస్తున్నా.. ప్రైవేటు బడులు ఇష్టారాజ్యంగా మార్కులు వేసుకుంటున్నాయని ఫిర్యాదులు రావడంతో ఆ విధానాన్ని రద్దు చేశారు. ఇప్పుడు 2025-26 విద్యా సంవత్సరం నుంచి పదిలో రాత పరీక్షకు 80 మార్కులు, అంతర్గతంగా 20 మార్కులు ఇచ్చేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. పాఠశాలలు ఇష్టారాజ్యంగా మార్కులు వేసుకోకుండా పకడ్బందీ విధానాన్ని తీసుకువచ్చేలా ఆలోచన చేస్తున్నారు. సీబీఎస్‌ఈలో అంతర్గత మార్కులు 20కి 20 వేసుకోకుండా ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తున్నారు. అలాంటి దాన్నే తీసుకురావాలని భావిస్తున్నారు. ప్రస్తుతం పదోతరగతి పరీక్షల్లో సూక్ష్మ, ఏక ప్రశ్నలు 12 ఉండగా.. వీటికి ఒక్కో దానికి అరమార్కు, తెలికైన 8 ప్రశ్నలకు ఒక్కో మార్కు ఉండగా.. వీటిని ఒక్కో మార్కు ప్రశ్నలుగా మార్పు చేయాలనే దానిపైనా కసరత్తు చేస్తున్నారు.

ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కోర్టు సమన్లు

ఈనాడు, హైదరాబాద్: తిరుమల శ్రీవారి లడ్డూ అంశంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తాను పిటిషన్ వేయగా సిటీ సివిల్ కోర్టు పవన్‌కు సమన్లు జారీ చేసినట్లు న్యాయవాది ఇమ్మనేని రామారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుమల లడ్డూ విషయంలో పవన్ భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేశారని పిటిషనర్ పేర్కొన్నారు. అయోధ్యకు పంపిన లడ్డూల్లో కల్తీ జరిగిందని పవన్ మాట్లాడారని, ఆ వ్యాఖ్యలను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని రామారావు కోరారు.



దిల్లీలో ఇండియన్ సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి లోకేశ్

ఆంధ్రాలో పెట్టుబడులు పెట్టండి

- ఐసీయా ప్రతినిధులకు మంత్రి లోకేశ్ ఆహ్వానం
- రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్ ఏర్పాటు చేయండి
- కేంద్ర మంత్రి జయంత్ చౌధరికి వినతి

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక విధానాన్ని అమల్లోకి తెచ్చి, అన్ని రకాల పరిశ్రమలకు అనువైన వాతావరణం నెలకొల్పుతున్నామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. రాష్ట్రానికి పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి సంస్థలను సాధించేందుకు సోమవారం ఆయన దిల్లీలో ఇండియన్ సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) ప్రతినిధులు, కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్‌చౌధరితో వేర్వేరుగా సమావేశమయ్యారు. తొలుత ఐసీఈఏ ఛైర్మన్ పంకజ్ మహీంద్ర అధ్యక్షతన జరిగిన సెల్యులర్, ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశంలో పాల్గొని ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మార్చడానికి తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. తాము ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగంలో దేశంలోని రాష్ట్రాలతో మాత్రమే కాకుండా దిగ్గజ దేశాలతో పోటీపడుతున్నట్లు తెలిపారు. పేరొందిన పారిశ్రామికవేత్తలతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి పరిశ్రమల స్థాపనలో ఎదురవుతున్న విధానపరమైన సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల కోసం అనువైన విధానాన్ని రూపొందించి ప్రోత్సాహకాలు అందించబోతున్నామని.. అందువల్ల ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. విశాఖపట్నాన్ని ఐటీ పవర్‌హౌస్‌గా, అంతర్జాతీయ ఏఐ రాజధానిగా తీర్చిదిద్దాలని, తిరుపతిని ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మారాల్చన్న లక్ష్యసాధనకు సహకరించాలని సెల్యులర్, ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ప్రతినిధులను కోరారు.



కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్‌చౌధరితో మంత్రి లోకేశ్

ఏపీలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయండి

ఆంధ్రప్రదేశ్ యువత నైపుణ్యాభివృద్ధి కోసం అమరావతి, విశాఖపట్నంలలో స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలు ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేశ్ కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్‌చౌధరిని కోరారు. ఆయన సోమవారం దిల్లీలో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో కలిసి జయంత్‌చౌధరితో సమావేశమయ్యారు. 'ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో అమరావతిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్, స్కిల్ ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్లను నెలకొల్పండి. విశాఖపట్నంలో కేటాయించిన ఎకరాల్లో జాతీయ నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయండి. మంగళగిరిలో జెమ్స్ అండ్ జువెలరీ, అమరావతిలో నిర్మాణ రంగం, కర్నూలులో పునరుత్పాదక ఇంధనం, చేనేత-హస్తకళలు, విశాఖపట్నంలో ఫార్మా ల్యాబ్, నెల్లూరు, తిరుపతిలో ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు చెందిన ఎక్సలెన్స్ సెంటర్ల ఏర్పాటుకు కేంద్ర స్కిల్ కౌన్సిల్ నుంచి సహకారం అందించండి. గిరిజన ప్రభావిత ప్రాంతాల్లో నైపుణ్య శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు నిధులిప్పించండి' అని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజు, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని ముంచిన వైకాపా సర్కారు

- వారు చేసిన అప్పుపై ఏటా కట్టాల్సిన వడ్డీయే రూ.75 వేల కోట్లు
- కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు రాష్ట్ర మంత్రి సత్యకుమార్ వివరణ



అమిత్ షాతో సమావేశమైన సత్యకుమార్ యాదవ్

ఈనాడు, దిల్లీ: రాష్ట్రాన్ని జగన్ రూ.11 లక్షల కోట్ల అప్పుల్లో ముంచిపోయారని.. ఫలితంగా ప్రస్తుత ప్రభుత్వం వాటిపై వడ్డీల రూపంలోనే ఏటా రూ.75 వేల కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు వివరించారు. జగన్ ప్రభుత్వం చేసిన పాపాలను కూటమి ప్రభుత్వం కడగాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. అమిత్ షాతో సోమవారం ఆయన సుమారు 20 నిమిషాలపాటు సమావేశమయ్యారు. మూడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలు, మంత్రిగా తాను చేసిన పనులను తెలిపారు. గత ప్రభుత్వం కేంద్రం నిధులను పక్కదారి పట్టించి, యూసీలు కూడా ఇవ్వలేదని చెప్పారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం యూసీలను సకాలంలో కేంద్రానికి పంపుతున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల వినియోగంపై వివరాలు అందజేశారు. ఆయుష్మాన్‌భారత్ అమలు తీరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పని విధానంపై అమిత్ షా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మచిలీపట్నం వైద్య కళాశాలకు పింగళి వెంకయ్య పేరు

ఈనాడు డిజిటల్, అమరావతి: మచిలీపట్నంలోని నూతన ప్రభుత్వ వైద్య కళాశాలకు జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య పేరును ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రేపు గుంటూరు, వైఎస్సార్ జిల్లాల్లో జగన్ పర్యటన

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్ బుధవారం గుంటూరు, వైఎస్సార్ జిల్లాల్లో పర్యటించనున్నారు. ఒక రౌడీషీటర్ కారణంగా అపస్మారక స్థితిలోకి వెళ్లి, గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యువతిని పరామర్శించనున్నారు. తర్వాత వైఎస్సార్ జిల్లాకు చేరుకుని బద్వేలులో హత్యాచారానికి గురైన బాలిక కుటుంబంతో మాట్లాడతారు. అక్కడి నుంచి పులివెందులకు వెళతారని వైకాపా కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

ప్రశ్నిస్తే కేసులు.. ఎదురు తిరిగితే దాడులు

- తండ్రి విశ్వరూప్ అధికారంతో రెచ్చిపోయిన శ్రీకాంత్
- దళిత యువకుడి హత్య కేసులో సూత్రధారిగా నిర్ధారణ



ఆదివారం రాత్రి మదురైలో పోలీసుల అదుపులో శ్రీకాంత్

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం, పి.గన్నవరం: అధికార బలంతో రెచ్చిపోయారు. తండ్రి మంత్రి పదవిని అడ్డం పెట్టుకొని ఇష్టారాజ్యంగా ప్రవర్తించారు. ఎవరైనా ప్రశ్నిస్తే.. పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారిని ఇబ్బంది పెట్టడం.. దూషణలకు పాల్పడేవారు. వైకాపా ప్రభుత్వ హయాంలో డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ వ్యవహారశైలి ఇది. 2022 జూన్ 6న జరిగిన అయినవిల్లికి చెందిన దళిత యువకుడు, వాలంటీర్ జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో ప్రధాన సూత్రధారి శ్రీకాంత్‌ను తమిళనాడులోని మదురైలో ఆదివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతేడాది అంబేడ్కర్ జయంతి సందర్భంగా కొందరు ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తొలగించి అమలాపురంలో ర్యాలీ చేయగా, నాలుగు వాహనాలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. వాటిని తమ వారికి ఇచ్చేయాలని శ్రీకాంత్ డీఎస్పీ మాధవరెడ్డిని కోరారు. ధ్రువపత్రాలతో రావాలని చెప్పడంతో ఆగ్రహంతో వెళ్లిన శ్రీకాంత్ తండ్రి విశ్వరూప్‌తోపాటు అనుచరులను తీసుకొని స్టేషన్‌కు వచ్చారు. 'మీరు అన్‌నెసరీ చేస్తున్నారు.. చలో అమలాపురానికి పిలుపునివ్వమంటారా? ఇంతకు వందరెట్లు పోలీసులను తెచ్చుకున్నా సరిపోరు' అంటూ విశ్వరూప్ డీఎస్పీపై ఆగ్రహించారు. పోలీసుల అనుమతి లేకుండానే వాహనాలను పట్టుకుపోయారు. అమలాపురం మండలం కామనగరువులో గతేడాది ఆగస్టు 31న శ్రీకాంత్ 'గడప గడపకు' కార్యక్రమం నిర్వహించారు. కోనసీమ జిల్లా పేరు మార్పు విషయంలో తమను అన్యాయంగా కేసుల్లో ఇరికించారని పలువురు యువకులు ఆయన్ను నిలదీశారు. దీంతో ఆ ముగ్గురు యువకులను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి రాత్రయినా పంపలేదు. స్థానికుల ఆందోళనతో అర్ధరాత్రి విడిచిపెట్టి కేసులు పెట్టారు. తాను కాబోయే ఎమ్మెల్యేనంటూ శ్రీకాంత్ ప్రచారం చేసుకున్నారు. ఉద్యోగుల నియామకాలు, బదిలీల్లో సైతం జోక్యం చేసుకునే వారనే ఆరోపణలున్నాయి.

చట్టం తన పని తాను చేసుకుపోతుంది

- మాజీ మంత్రి విశ్వరూప్ తనయుడి అరెస్టుపై మంత్రి సుభాష్



రామచంద్రపురం, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లికి చెందిన వాలంటీరు జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఈ కేసులో మాజీ మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్‌ను పోలీసులు అరెస్టు చేయడం వెనుక తన ప్రోద్బలం లేదని స్పష్టం చేశారు. విశ్వరూప్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఖండించారు. రామచంద్రపురంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ' 'విశ్వరూప్ కుమారుడైన పినిపె శ్రీకాంత్‌కు దుర్గాప్రసాద్ ప్రధాన అనుచరుడు. ఆయన హత్య తర్వాత బాధిత కుటుంబానికి శ్రీకాంత్ రూ.లక్ష సాయం చేసి, హతుడి భార్యను ఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్లారు. రెండు ఎకరాల పొలం ఇస్తామని, కేసు పెట్టవద్దని విశ్వరూప్ బాధిత కుటుంబాన్ని బతిమిలాడారు. మృతుడి భార్య ఇద్దరు పిల్లలతో నా వద్దకు వచ్చారు. చట్టపరంగా న్యాయం చేస్తానని చెప్పి.. ఆమెను ఐజీ, డీఐజీల వద్దకు తీసుకెళ్లా. దుర్గాప్రసాద్‌ను ఫోన్ చేసి పిలిచి, చంపేశారని ఆయన భార్య చెబుతున్నారు. విచారణలో పూర్తి వాస్తవాలు తెలుస్తాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ కేసును ఎందుకు మూసేశారో చెప్పాలి. కోనసీమ అల్లర్లలో నేను ప్రధాన ముద్దాయినంటూ విశ్వరూప్ అసత్యాలు చెబుతున్నారు. ఆ కేసును వైకాపా ప్రభుత్వంలోనే కొట్టేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట ప్రకారం మేము కక్షపూరిత చర్యలకు పాల్పడబోము. న్యాయపరంగానే ముందుకెళ్తాం' అని వివరించారు.

అప్పట్లో ఈ కేసు దర్యాప్తు సక్రమంగా జరగలేదు: మంత్రి లోకేశ్

'రాష్ట్రంలో హింసను గత ప్రభుత్వం పెంచి పోషించింది. అందుకే ఈ హత్యకేసు దర్యాప్తు సక్రమంగా జరగలేదు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మృతుడి కుటుంబసభ్యులు ధైర్యం చేశారు. తమకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి కేసు దర్యాప్తు వేగం పుంజుకుంది' అని ఎక్స్ వేదికగా మంత్రి లోకేశ్ వివరించారు.

ఆదర్శ పౌరులతో విశ్వగురుగా భారత్



వెంకయ్యనాయుడితో చిగురుపాటి వరప్రసాద్, మంత్రి కొల్లు, ఎమ్మెల్యేలు రామ్మోహన్, యార్లగడ్డ, బోడే, మండలి, గొండు శంకర్, మాజీ ఎంపీ కనకమేడల, వైవీబీ, ఆలపాటి



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

కానూరు, న్యూస్‌టుడే: విద్యారంగంలో ఆదర్శవంతమైన విద్యార్థులు, పౌరులను తీర్చిదిద్దడం ద్వారా భారత్‌ను విశ్వగురుగా నిలపవచ్చని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. సోమవారం పోరంకిలోని చిగురుపాటి శ్రీకృష్ణవేణి విద్యాసంస్థల 40 ఏళ్ల వేడుకలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 40 ఏళ్లుగా లక్ష మంది విద్యార్థులకు విద్య అందించడం గొప్ప విషయమన్నారు. ఈ రోజుల్లో సంస్కారం లేని చదువే ఎక్కువగా కనిపిస్తుందన్నారు. క్రమశిక్షణ, అంకితభావం, కష్టపడి పనిచేయడం వంటి మూడు విషయాలతో ఈ రంగంలోనైనా రాణించవచ్చని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు ఈ రోజుల్లో ఏ పార్టీలో ఉన్నారో రోజు చూసుకోవాల్సి వస్తుందని చెప్పారు. ప్రజాప్రతినిధుల ప్రసంగాలు, ప్రవర్తన బాధ కలిగిస్తుందన్నారు. బ్రిటీష్ పాలనతో వెనకబడిన మన దేశం ఇప్పుడు పుంజుకుంటుందని వెల్లడించారు. ప్రపంచంలో ఎన్నో బహుళజాతి సంస్థలకు భారతీయులు సీఈవోలుగా ఉన్నారన్నారు. మాతృభాషను అందరు గౌరవించాలని, ఇంగ్లీషుకు తాను వ్యతిరేకం కాదని పేర్కొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, విశ్రాంత సీజేఐ ఎన్.వెంకటరమణ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ అందరు మాతృభాషలోనే చదివి ఉన్నతస్థాయికి చేరుకున్నారన్నారు. జంక్ ఫుడ్‌లతో చిన్నారులు, విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. నేనే పదవీ విరమణ చేశాను కానీ పెదవీ విరమణ చేయలేదన్నారు. అన్ని ప్రాంతాలను సందర్శించి యువతలో స్ఫూర్తి నింపడమే తన ధ్యేయమని తెలిపారు. శ్రీకృష్ణవేణి విద్యాసంస్థల ఛైర్మన్ చిగురుపాటి వరప్రసాద్ మాట్లాడుతూ.. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తాను కష్టపడి చదివి ఈ రోజులు ఈస్థాయిలో లక్షమందికి విద్యను అందించే స్థాయికి వచ్చామన్నారు. అనంతరం చిగురుపాటి వరప్రసాద్ కుటుంబసభ్యులు, పాఠశాల అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు మాజీ ఉప రాష్ట్రపతిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్, ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, గద్దె రామ్మోహన్, మండలి బుద్ధప్రసాద్, గొండు శంకర్, కామినేని శ్రీనివాస్, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, పాఠశాల ప్రతినిధులు, నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

కదంతొక్కిన సీహెచ్‌వోలు



ప్లకార్డులతో నిరసన

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్స్ (విలేజ్ హెల్త్ క్లినిక్స్)లో వైద్య సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సీహెచ్‌వో)లు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం విజయవాడలో పెద్ద ఎత్తున ధర్నా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న వారందరూ భారీగా తరలివచ్చారు. దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నినదించారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న తమకు గత వైకాపా ప్రభుత్వం వేతనాలు పెంచలేదని ధ్వజమెత్తారు. వీరికి ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. సీహెచ్‌వోలకు మినిమం టైమ్‌స్కేల్, కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పది నెలల బకాయిలు, హెల్త్ క్లినిక్స్ అద్దెలు, విద్యుత్తు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా సీహెచ్‌వో, ఎన్‌హెచ్‌వో ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. నేషనల్ హెల్త్ మిషన్ ఐకాస రాష్ట్ర అధ్యక్షురాలు దయామణి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, కూటమి ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ సీహెచ్‌వోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రియాంక, ఉపాధ్యక్షుడు పులి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. మ్యాట్రిక్స్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు మధు, సుధాకర్, ప్రమోద్, దుర్గాభవానీ, సిద్దయ్య, నీలిమ, రాజేశ్వరి, వర్మ, అహ్మద్ బాషా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిని పంచాయతీకి అనుసంధానం చేయండి



ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధిమీనాకు వినతి పత్రం అందజేస్తున్న వసంత్‌కుమార్ తదితరులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీకి ఒక సచివాలయం ఏర్పాటు చేసి, సచివాలయ సిబ్బందిని పంచాయతీకి అనుసంధానం చేయాలని ఉమ్మడి కృష్ణా జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోలి వసంత్‌కుమార్ కలెక్టరేట్‌లో ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధిమీనాను సోమవారం కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రతి సచివాలయంలో 11 మంది ఉద్యోగులను నియమించారని, వారిపై సరైన పర్యవేక్షణ లేకుండా పోయిందని అన్నారు. చాలా పంచాయతీల్లో రెండు నుంచి ఐదు సచివాలయాలు ఏర్పాటు చేశారని, అవసరానికి మించి ఉద్యోగులు ఉన్నందున వారికి పూర్తి స్థాయిలో పని లేకుండా పోయిందన్నారు. వేతనాలు ఇచ్చేది ఒకరు, పని చేయాలని ఆదేశించేది ఇంకొకరు, హాజరు చూసేది మరొకరు, పనితీరు విశ్లేషించేది వేరొకరు కావడం వల్ల ఎవరి ఆదేశాలు పాటించాలో తెలియని స్థితిలో ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. ఈ వ్యవస్థను చట్ట వ్యతిరేకంగా రూపకల్పన చేశారని ఆరోపించారు. పరిష్కారంగా పంచాయతీకి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి ఆ సచివాలయంలో సిబ్బందిని పంచాయతీ ఆధీనంలోకి తీసుకురావాలని మూడేళ్ల నుంచి తాము అనేక ఉద్యమాలు చేశామని గుర్తు చేశారు. సర్పంచులు పంచకర్ల సురేష్, మన్నే సాత్విక, కొప్పుల సీతారామయ్య, కసుకుర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తమోడిన దారులు

వేర్వేరు ప్రమాదాల్లో అయిదుగురి దుర్మరణం

ఉమ్మడి కృష్ణా జిల్లాలో రోడ్లు రక్తసిక్తమయ్యాయి. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రహదారి ప్రమాదాల్లో అయిదుగురు వ్యక్తులు దుర్మరణం చెందారు. వాహనాల మితిమీరిన వేగం.. అమాయకుల ప్రాణాలను బలిగొంది. బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే: విజయవాడ గ్రామీణ మండలం నున్న సమీపంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వీరిద్దరి ఇంటి పేర్లు ఒకటే కావడంతో.. బంధువులు అయి ఉంటారని స్థానికులు భావించారు. కానీ.. ఒకరితో ఒకరికి సంబంధమే లేదు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అజిత్ సింగ్‌నగర్ గంగానమ్మగుడి సెంటరుకు చెందిన సుంకర సాంబశివరావు (53) వంట మేస్త్రిగా పని చేస్తున్నారు. ఎక్కడైనా వంట పని ఉంటే ఆటోలో వెళుతుంటారు. సోమవారం ఉదయం గన్నవరం మండలం పాలెం అడ్డరోడ్డులోని శివాలయంలో అన్నదాన కార్యక్రమం ఉండటంతో బయలుదేరారు. ఉదయం 5.30 గంటల వేళ.. ఆటోలు ఏమీ లేవు. ఈ క్రమంలో ఆగిరిపల్లిలోని గెయిల్ కంపెనీలో డ్యూటీకి వెళుతున్న విశ్రాంత సైనికోద్యోగి సుంకర దుర్గారావు (43) కనిపించగా.. లిఫ్ట్ అడిగి ద్విచక్రవాహనం ఎక్కారు. నున్న శివారు వద్దకు రాగానే అతివేగంగా వచ్చిన గుర్తు తెలియని వ్యాను వారిని ఢీకొంది. ఇద్దరూ గాలిలో ఎగిరి రోడ్డు పక్కన పడిపోయారు. తలకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన వాహనం అద్దం, దిష్టికి కట్టే దండ ఘటనాస్థలంలో పడ్డాయి. దీన్ని బట్టి.. అది మినీ ట్రాన్స్‌పోర్ట్ వాహనం అయి ఉండడొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దానిపై ఆరా తీస్తున్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో సాంబశివరావు, దుర్గారావు మృతదేహాలు. పక్కనే ధ్వంసమైన ద్విచక్రవాహనం



సుంకర దుర్గారావు గుర్తింపు కార్డు

రోడ్డుదాటుతూ వాచ్‌మెన్...

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన గన్నవరం మండలం కేసరపల్లి వద్ద చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బుద్ధవరానికి చెందిన మరీదు కృష్ణ (55) కేసరపల్లిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. యథావిధిగా విధులకు వచ్చిన కృష్ణ.. తెల్లవారుజామున పని మీద హైవే దాటుతుండగా అతివేగంగా వచ్చిన వ్యాను అతడి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటన జరిగిన కొంత సమయం అనంతరం అదే ప్రాంతంలో ఓ లారీ యూటర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి అతివేగంగా వచ్చిన బొలేరో వాహనం లారీని ఢీకొంది. ప్రమాదంలో బొలేరో వ్యాను డ్రైవర్‌కు స్వల్ప గాయాలవ్వగా విజయవాడ ఆసుపత్రికి తరలించారు.

కుమారుడిని బస్టేషన్‌కు తీసుకెళుతూ..

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: కుమారుడిని హైదరాబాద్‌కు పంపేందుకు వెళుతున్న తండ్రిని కారు ఢీకొట్టడంతో.. ప్రాణాలు కోల్పోయిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. సూర్యారావుపేట పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మాచవరం పోలీస్‌స్టేషన్ సమీపంలోని శీలం దేవకరరావు (55) నివసిస్తున్నారు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు హైదరాబాద్‌లో చదువుతున్నాడు. ఆదివారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో అతడిని బస్‌స్టేషన్‌లో దింపేందుకు తండ్రి బయలుదేరారు. ఇద్దరూ రెండు వేర్వేరు బైక్‌లను బుక్ చేసుకున్నారు. చెరో బండి మీద వెళుతున్నారు. రీజినల్ ఇంటెలిజెన్స్ కార్యాలయం వద్దకు రాగానే.. సీపీ కార్యాలయం వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు తండ్రిని ఢీకొంది. ద్విచక్ర వాహనం నడుపుతున్న షేక్ కరీముల్లాతో పాటు దేవకరరావులు తీవ్రంగా గాయపడ్డారు. దేవకరరావును ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. దీనిపై సూర్యారావుపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని మెకానిక్..

చిట్టినగర్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మెకానిక్ మృతి చెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... షేక్ అఫ్తాబ్(23) వైఎస్ఆర్ కాలనీలో ఉంటున్నారు. ఈ నెల 20వ తేదీన రాజీవ్ నగర్‌లోని తన స్నేహితుడి వద్దకు వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై రాత్రి 11 గంటలకు ఇంటికి వస్తున్నారు. పైపుల రోడ్డు నుంచి వస్తుండగా వైవీ రావు రింగ్ సమీపంలోని వెల్‌కమ్ హోటల్ వద్ద వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కొత్తపేట పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

టాలీ కోర్సులో ఉచిత శిక్షణ

పటమట, కరెన్సీనగర్, భాస్కరపురం(మచిలీపట్నం): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కానూరులోని ఫెడరల్ స్కిల్ అకాడమీ ట్రైనింగ్ సెంటర్లో టాలీ కోర్సులో సర్టిఫికెట్‌తో కూడిన ఉచిత శిక్షణ అందిస్తున్నామని, అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీకాం, బీఏ, బీబీఏ, ఎమ్‌కామ్ పూర్తి చేసి ఉండాలని, 18 నుంచి 30 ఏళ్ల వయోపరిమితి ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఈ నెల 28 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. శిక్షణ అనంతరం ప్రైవేటు రంగ సంస్థలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో గల ఆసక్తి గల అభ్యర్థులు కానూరు తులసీనగర్‌లోని ఫెడరల్ స్కిల్ అకాడమీ ట్రైనింగ్ సెంటర్లో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 87146 92748, 87146 92749 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.